UNIVERSAL LIBRARY
OU_204119
UNIVERSAL LIBRARY

వివేకచంద్రికలు:



# 5. ప్రబుద్ధ భారతము.

శ్రీమత్ వివేకానందస్వామి ప్రణీతము.

ప్రకాశకులు:

మకృష్ణ పూజామందిరము

కొత్తపేట, గుంటూరు.

1933

All rights reserved]

[వెల రు 0-2-0.

## ఆంధ్రసోదర సోదరీమణులకు శ్రీరామకృష్ణ పూజా మందిరమువారి విజ్ఞప్తి.

శ్రీరామకృష్ణ పూజామందిరము "మానవసేవ" భగవన్నామ సంకీర్తనము" మొదలగు సాధనములను, ఆంధ్ర మండలమున వ్యాపింపజేయుటకు 8-3-31 తేదీన స్థాపించబడిన సేవాసంస్థ.

ఈ పూజామందిరమునందలి శాఖలు:-

1. శ్రీ సీతారామనామ సంకీర్తన మందిరము: భగవన్నామసంకీర్తనము, నగరసంకీర్తన, ఏకాంతధ్యానము మొదలైనవి యీ శాఖద్వారా వ్యాపింపచేయబడుచున్నవి.
2. భక్తిప్రబోధిని మాసపత్రికయందు ఆధునిక భారతవర్ష నిర్మాతలగు, శ్రీకృష్ణచైతన్య మహాప్రభువు, భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీమత్ వివేకానందస్వామి, శ్రీ కుసుమహరనాథబాబారు, మొదలగు మహావతారముల చరిత్రములు, యుపదేశములు, వరుసగా ప్రకటింపబడుచున్నవి.
3. శ్రీ చైతన్యమహావిద్యాలయమునందు బాలుర కుచితముగా భోజనసదుపాయముల నేర్పరచి, నామసంకీర్తన మొదలగు భగవద్విషయముల యందు, సాధన చేసికొనుట కేర్పాటు గావించి యున్నాము.
4. వివేకచంద్రికలద్వారా ఆధునికవిజ్ఞాన నిర్మాతలగువారి గ్రంథరాజములను 12 ప్రచురించి, యున్నత భావప్రచారమును చేయుచున్నాము.

### విజ్ఞప్తి.

ఈ కార్యక్రమమును జరుపుటలో నెలకు కొన్ని వందలరూప్యములు ఖర్చు అగుచున్నను, ఉచితముగా చందాలను వసూలు చేయుటలేదు. స్వయంసహాయమాత్రమునే అవలంబించుచున్నాము. తాము మా భక్తిప్రబోధిని కిన్ని, వివేకచంద్రికలకున్ను, చందాదారులుగాచేరి అందుప్రచురించబడుచున్న అత్యద్భుత విషయములను శక్తిసామర్థ్యముల ననుసరించి క్రియారూపములో బెట్టి, తమ జీవితమును సార్థకము జేసుకొనినయెడల మాకనేకవిధముల తాము సహాయము చేసినవారగుదురు. శ్రీరామానుగ్రహమును సంపాదించగలరు.

శ్రీరామకృష్ణ పూజామందిరము,
కొత్తపేట, గుంటూరు.

# ప్రబుద్ధ భారతము.

(శ్రీవివేకానంద ప్రణీతము.)

తత్వానందస్వామి,

అనువాదకులు.

ఒకఁడు యోగ్యతను సంపాదించుట యెంత అవసరమో, వాఁడు దానిని ఇతరులకు పంచియిచ్చుటయు అంతఅవసరమే. పంచియిచ్చుటే యెక్కువ ఆవశ్యకమైనదని నుడువవచ్చును. హృదయమునందు రక్తము కూడుకొనుట జీవించుటకు ముఖ్యావసరము. కాని అది శరీరమంతటను వ్యాపింపనిచో మరణము తప్పదు. ఒక్కొక్క-కాలమందు విద్యయు అధికారమును కొన్ని కుటుంబములయందుగాని, వర్ణములయందుగాని యితరులకు లేకుండ, కూడుకొనియుంట సంఘమునకు శ్రేయోదాయకమే; కాని ఆ అధికారము తాత్కాలికముగ అచ్చట ఉన్నను ముందుముందు సంఘమున అంతటను అది వ్యాపించవలెను. అట్టివ్యాపకము అడ్డగింపఁబడినచో ఆసంఘముయొక్క వినాశము త్వరలోనే కలుగును అనుటకు సందియములేదు.

# పీ ఠి క.

ఈ గ్రంథము శ్రీశ్రీశ్రీ వివేకానందస్వాములవారి [Modern India] అభినవ భారతము అను వ్యాసము యొక్క ఆంధ్రానువాదము. ఇది 1909 సంవత్సరమున 'భారత దర్పణము' అను పేరుతో ప్రకటింపబడియున్నది. ఆ ప్రతులు ఇప్పుడు ఎక్కడను చిక్కుటలేదు. ఈ పుస్తకము కొలదిపాటి సవరణలతో, ఇప్పుడు 'ప్రబుద్ధభారతము' అను పేరున పునః ప్రకటింపబడుచున్నది. ఈ చిన్నిపొత్తమును చదువునప్పుడు, ఈనాడు భారతదేశములో జరుగుచున్న హరిజన ప్రబోధము మున్నగు మహాసంఘటనలను చూచి, ఒక గ్రంథమును కల్పన చేసి దానిని శ్రీ వివేకానందస్వాములవారిపేర ప్రకటించిరా అనునటుల తోచిన అబ్బురముండదు. దీని మాతృకను శ్రీ స్వాములవారు 1899 సంవత్సరముననే ప్రకటించియున్నారు. త్రికాలవేదియగు శ్రీ వివేకానందస్వాములవారు ఇప్పుడు మనము చూచుచున్న భారతీయ ప్రబోధమును సుస్పష్టముగ లక్షించి ప్రవచించియున్నారు. ఈ ముప్పది సంవత్సరముల నుండియు దేశమున జరుగుచుండిన ఆయా సంఘటనలు ఇందు వివరింపబడి యున్నను, ఈనాడు మనము ఎల్లెడల చూచు హరిజనప్రబోధముతో సకలవర్ణముల వారియందును, సమస్త సంఘముల వారియందును కలిగిన సంచలనమును చూడగా నేడు భారతభూమి నిద్రనుండి మేల్కాంచు సమయమున ఫోటోతీసి దానిని అభివర్ణించెనా అనునటుల ఈ గ్రంథమున చక్కని వివరణలు చూపట్టుచున్నవి. అందువలన "ప్రబుద్ధ

భారతము" అను పేరుతో ద్వితీయ ముద్రణమును సాగించితిమి. ఇందు భారతదేశచరిత్ర, ఋగ్వేదకాలమునుండి నేటి దినమువఱకు కలిగిన మత, సాంఘిక, రాజకీయ, వాణిజ్య, ఆర్థిక పరివర్తనముల సూక్ష్మవివరణములతో సహా, సంగ్రహముగ కూర్చబడియున్నది. ఆయా కాలములలో, ఆయా అవస్థలలో ఇతరదేశములును ఎట్లు పరివర్తనముల పొందెనో తెలుపుచు, జాతి పరిణామసూత్రముల విశదీకరించుచు, చక్కని ఉదాహరణలతో బోధించుచు, మనము భావికాలమున ఏ సూత్రములను అనుసరించి వర్తింపవలసియుండునో కూడ స్పష్టపఱచియున్నారు. ప్రతి భారతస్త్రీయు, ప్రతి భారత పురుషుడును చదివితీరవలసిన గ్రంథరాజముగ నున్నది. కొలది పాటి చదువు గలవారికిని బాగుగ తెలియునిమిత్తము, సంధులను విడదీసి, చిన్నచిన్న వాక్యములతో ఈ అనువాదము పాఠకులకు అందచేయబడుచున్నది. ఎల్లఱును దీనింజదివి మహోపకారమును పొందగలరు. దీనిని సరసమైన వెలకు ఆంధ్రసోదరులకెల్ల అందచేయ పూనుకొనిన శ్రీ రామకృష్ణ పూజామందిరమువారు అందఱి కృతజ్ఞతకును పాత్రులనుటకు సందియములేదు. తుదిని చేర్చిన పద్యముల రచించి ఈ అనువాదమునకు వన్నెకూర్చిన సోదరుడు సాయం వరదదాసుగారికి ఎంతయు కృతజ్ఞుడను.

సర్వేజనా స్సుఖినోభవంతు

శ్రీ ఓంకారాశ్రమము,
తెనాలి. 15-3-33.

తత్త్వానందస్వామి

శ్రీ

రామకృష్ణాయనమః.

# ప్రబుద్ధ భారతము.

వేదయుగమునాఁటి యాజకులు* యజ్ఞయాగాది క్రతుసంబంధి మంత్రజ్ఞానమును తమ బలౌన్నత్యములకు ఆధారము చేసికొని యుండిరి. మంత్రసామర్థ్యమువలన దేవతలు తమ దివ్యనిలయములనుండి దిగివచ్చి, తమ కర్పింపఁబడు ఆహార పానీయముల గ్రహించి, యజమానులకు (క్రతుకర్తలకు) ఈప్సితార్థముల నొసంగునటుల వర్ణించియుండిరి. కాన రాజులును వారిప్రజలును తమ భౌతికాధ్యాత్మికజీవితముల క్షేమము కొఱకై ఈ యాజకులను ఆశ్రయింపవలసినవారైరి. సోమరసరాజము యాజకులచేత ఆరాధింపఁబడి, వారి మంత్రి బలిమిచేత వర్ధిలుచుండెను. కాన యాజకునిచేత అర్పింపఁబడు సోమరసమందు ప్రీతులగు దేవతలు, వానియెడల దయగలవారై వరము లొసంగుచుండెడివారు. ఇట్లు దేవతల అనుగ్రహ బలయుతుండగు యాజకుఁడు మానవవైరుల నిరసింపు చుండెడివాడు. కాకేమి ? దైవబలమునకు ఎదురై మానవబలమేమిచేయగలద్దు? భౌతికబలమునకెల్ల నిధియగుభూపతియు అట్టియాజకుని వాకిట ఆశ్రితుడై పడియుండెడివాఁడు. వాని కటాక్షవీక్షణము మహోపకారముగ నుండె; వాని ఆశీర్వచనమే రాజ్యమునకున్నిటినిమించినబలము! ఈయాజకుడు ఒకతఱి

---

*పురోహితులు.

చాపప్రబలుతులుల తేల్చు కార్యములంగు రాజును నియమించును. ఒకప్పుడు దాక్షిణ్యమూని సద్బోధ నొసర్చువాడై సుస్థిర స్నేహమున వాని చెంత నిలుచును. వేళోండుచో సులభముగ రాజునే బాధించివేయు రాజ్యతంత్రపు ఉచ్చుల పన్నును. యాజకుడు ఇట్లు ధరణీశ్వరుని అధికారమును పూర్ణముగ తన వశవముచేసికొనియుంట తెలుచుగ కానంబడుచున్నది. అన్నిటి కన్న రాజునకు భయకారణమేమన, తనపూర్వులయొక్క, తనయొక్క తన కుటుంబముయొక్క పేరు ప్రతిష్ఠలు తనను దయతోఁ కాపాడు యాజకుని లేఖినిని అనుసరించియుండునుఅనెడు భావమే. యాజకుడే చరిత్రకారకుడు! రాజు అత్యున్నతాధి కారము కలిగియుండవచ్చును; వాని పరిపాలనమున అత్యం తము ప్రఖ్యాతి కాంచవచ్చును; ప్రజలకెల్ల తానే తల్లియు తండ్రిగ నుండవచ్చును. కాని వాని పురోహితుఁడు తృప్తుఁడు కానిచో వానిఖ్యాతిప్రభాకరుఁడు వానితోడనె అస్తమించి పోవును! సముద్రమునపడు లేఁతమంచువలె, వాని యోగ్య తయు, వాని ఉపకృతియు, జగద్వంద్యమైనప్పటికిని, కాల మను సముద్రమునంబడి నశించును. ఇట్లుండ ఇతర రాజులు సంవత్సరములకొలఁది కష్టించి అశ్వమేధాది యాగంబుల నాచరించి, వర్షఋతువునందలి మేఘములవలె పురోహితులపై ధనమును కురిపించినచో, ఆ పురోహితుల అనుగ్రహమువలన వారినామములు చరిత్రపత్రంబులందుఁ ప్రకాశింపుచుండును. దేవహితుండగు "ప్రియదర్శినధర్మాశోకు"ని నామము యాజక

లోకమున నామావశిష్టంబై యుండె. అయినను 'పరీక్షిత్తుని' పుత్రుడగు 'జనమేజయుని' పేరు ప్రతి జనునినోటనుండె !

రాజ్యమును రక్షించుకొనుటకును, భోగములకును ఆడంబరములకును, తన సేవకావళికిని నై వ్యయపఱచుకొనుటకును, మున్ముందుగ సర్వాధికారులగు పురోహితులను తృప్తి చేయుకొనుటకును, వారి ధనాగారముల నింపుకొనుటకును, సూర్యుడు భూమినుండి జలమును పీల్చుకొనునట్లు, రాజు తన ప్రజల ధనమును సదా ఆకర్షింపుచుండును. ముఖ్యముగ వాని బారిపడువారు (వాని గంగగోవులు) వైశ్యులైయుండిరి.

హిందూరాజుల కాలమునగాని, బౌద్ధపరిపాలనయందు గాని జనసామాన్యము రాజకీయ విషయంబులందు ఏవిధమగు పలుకుబడియును కలిగియున్నట్టుల కానంబడదు. వారణాశి యందు వసించునప్పుడు యుధిష్ఠిరుఁడు వైశ్యుల యిండ్లకును, శూద్రుల యిండ్లకునుకూడ వెళ్లుచుండెడివాఁడు; సత్యమే. అయోధ్యారాష్ట్రమున ప్రజలు రామచంద్రుని పట్టాభిషేకమును అంగీకరించిరి; నిజమే. ఇంతయెకాదు, సీతవర్తనమును ఆక్షేపించి, ఆమె వనవాసమునకై రహస్యముగ వ్యూహములు పన్నగల్గిరి! కాని రాష్ట్రపాలనయొక్క చట్టములందు, ప్రధానరాజకీయవిషయములందు వారికి ఏపాటి పలుకుబడియు అంగీకరింపఁబడి యుండలేదు. అయినను ఆప్రజల అధికారము, నియతమార్గమేదియు లేకున్నను, పరోక్షమగు ఆందోళనముతో తలఁజూప యత్నింపుచుండెడిదే. తమయందిట్టి అధికారము కలదనిమాత్రము ఆజనులకు తెలియదు! ఐకమత్యము

తోడ పనిచేయుటకై కట్టుదిట్టములను ఏర్పఱచుకొనుటకు ప్రయత్నములేవియు చేయబడియుండలేదు; అట్టుల కావింపవలయునను ఉద్దేశ్యమైనను వారికిలేదు. స్వల్పములై చెదిరి వర్తింపుచున్న అధికారములను సమీకరణమొనర్చి అందువలన అనుల్లంఘనీయమగు బలమును ఆవిర్భవింపఁజేయఁజాలు సమర్థతయు, నేర్పును వారియందెంతమాత్రమును కానరాదు.

ఇట్లగుట యోగ్యమగు చట్టములు లేకుంటవలననా? కాదు; అందువలన నెంతమాత్రము కాదు. పరిపాలనయందలి వివిధశాఖల విధానముంగూర్చి వేఱువేఱుగ స్పష్టమగు చట్టములును ఆచరణవిధానములునుకలవు; పన్ను వసూలుచేయుట, సైన్యమును పాలించుట, న్యాయనిర్ణయముచేయుట, దండన పారితోషికముల నిర్ధారణచేయుట మున్నగు ప్రతివిషయముం గూర్చియు చట్టములు పూర్ణముగ వ్రాయఁబడియేయున్నవి. కాని వీనికెల్ల ఆధారముగ, దైవశాసనబలయుతుడును దివ్యదృష్టియుగల ఋషిముఖమునఁ బ్రకటింపబడినట్టియు ఈశ్వరునాదేశముతోఁ గూడినదియు నగు ఋషియాజ్ఞ వెలయుచుండెను. దానియందు స్వేచ్ఛకించుకంతయు అవకాశము లేదనియే చెప్పవచ్చును. ఇట్టి స్థితియందు ప్రజలు తమలాభమునకై దేనినేని చేయుటకుఁ దమలో తాము ఆలోచించుకొని, యేకీభావమును ఒనగూర్చుకొనఁ గలుగునట్టిగాని, తమవలన రాజు ప్రోగుచేయుధనరాసులపైని తమకుఅధికారముకలదను సంకల్ప మంకురించుటకుఅనువగు సాంద్రబుద్ధి విశేషముం బ్రసాదింపఁజాలునట్టిగాని, తుదకు రాజ్యముయొక్క ఆదాయ

వ్యయములపైని అధికారముఁ జెల్లించు ప్రజాప్రాతినిధ్య స్వత్వముసు సాధింపవలయునను కుతూహలమును కూర్చునట్టిగాని, సామర్థ్యమును ఒసగు విద్యను ఎట్టిదానినేని సంపాదించుటకు ప్రజలకు ఎంతమాత్రమును అవకాశము లేదయ్యె! అట్టివానిని వారేల ఆశింపవలె? ప్రజలకువృద్ధిని ఐశ్వర్యములను సమకూర్చుటకు ఋషియొక్క దివ్యజ్ఞానమే యుండెఁగదా!

కాని అట్టిచట్టములు అన్నియు పుస్తకములందు ఉండియున్నవి. ఆపుస్తకములందు చూపట్టు స్మృతిచట్టములకును, ప్రత్యక్షజీవితమున వాని ఆచరణకును మహత్తరమగు వ్యత్యాసము ఉండెడిది. ♦అగ్నివర్ణులు వేయిమంది గడచినపిమ్మట ఒక్క రామచంద్రుఁడు ఉద్భవించును; §ఛండాశోకుని వర్తనమును ఆదర్శముగ పెటుకొనివర్తించుచక్రవర్తులు అనేకులు; †ధర్మాశోకులు అరుదు! ప్రజలను ప్రాణతుల్యులుగ చూచిన * అక్బరు

♦ అగ్నివర్ణుఁడు ఒక సూర్యవంశపురాజు. అతఁ డెన్నఁడును అంతఃపురమును విడిచేవాఁడు కాఁడు. తుదకు విషయలోలత్వముచే వ్యాధిపీడితుఁడై మరణించెను.

§ బౌద్ధరాజులలో అగ్రగణ్యుండగు 'అశోక' మహారాజు మొట్టమొదట తనసోదరులఁ జంపి, బహుక్రూరకృత్యములఁ జేసి రాజ్యమును ఆక్రమించుకొనెను. అప్పుడు "ఛండాశోకుఁడని" పిలువఁబడెను.

† ఇట్లు తొమ్మిదివత్సరములు గడచినపిమ్మట ఆ ఛండాశోకుడు బౌద్ధమతావలంబుఁడై జీవహింస పాపహేతువని తెలిసి కరుణాయుతుండై రాజ్యమును పాలించెను. అప్పుడు 'ధర్మాశోకుడు' అను పేరువడసెను.

* మహామ్మదీయ రాజులలోనెల్ల ఉత్తముండును, హిందువులను మహామ్మదీయులను సమముగ ప్రేమించి ధర్మపాలనముచేసిన రాజు 'అక్బరు'.

వంటి పాదుషాలసంఖ్య, ప్రజలను పీల్చిపిప్పిచేసిన *ఔరంగ జేబువంటి పాదుషాల సంఖ్యకన్న కడు స్వల్పము!

దివ్యగుణసమేతులగు యుధిష్ఠిరుఁడు, రామచంద్రుఁడు ధర్మాశోకుఁడు, అక్బరు మున్నగు రాజుల సద్ధర్మపాలనమున ప్రజలు క్షేమంబుననుండి ఐశ్వర్యములను అనుభవింపుచు, తమ యేలికలచేత బిడ్డలలీల పాలింపఁబడిననేమి? వేఱొకనిచేత ఆహారము తినిపించబడువానియొక్క హస్తము, క్రమక్రమముగ నోటికి ఆహారమును అందిచ్చుశక్తినే కోలుపోవునుగదా! అటు లనే సర్వవిధముల పరుల రక్షణక్రిందనుండువాని "ఆత్మరక్షణ సామర్థ్యము" పూర్ణముగ ఎన్నఁడును పరిణమింపనేరదు. బలాఢ్యుఁడగు బాలుఁడుసహా తనతండ్రిచేత ఎల్లప్పుడును పసి బాలునిలీలనేచూడఁబడునేని, సదా పసిబాలుఁడుగనే యుండి పోవును. దైవసములయిన రాజుల పాలనక్రిందనుండి తమ రక్షణ పోషణక్రియలను పూర్ణముగ వారి చేతులలోనే విడిచి వేసిన ప్రజలకు ఎన్నఁడును స్వరాజ్య ధర్మములను నేర్వగలట్టి అవకాశముండదుసుడీ!

అట్టిప్రజలు సర్వమునకును తమయేలికలనే ఆధార ముగ చేసికొని, తమ సామాన్యక్షేమమును ఆత్మరక్షణమును కూడ చూచుకొనక విడిచియుండినయెడల, క్రమక్రమముగ తమ సహజబల స్వత్వములనుగూడ కోలుపోదురు. ఇట్టి పర

---

* మహమ్మదీయమతావేశమున హిందువులను పలువిధముల బాధించి, దేవాలయముల నిర్మూలము గావించి, గ్రంథనిలయముల దగ్ధము చేసిన వాఁడుగ 'ఔరంగజేబు' కొన్ని చరిత్రలందు ప్రకటింపబడెను!

తంత్రతయు, పరరక్షణమును చిరకాలము సాగినచో అది ఆజాతియొక్క వినాశమునకు హేతువుకాగా దాని నిర్మూలనము కతిపయ దినములలోనే సంభవించును.

మహాఋషులు దివ్యజ్ఞాన ప్రేరితులయి సమబుద్ధితో రచించిన శాస్త్రములచేత నియమింపఁబడిన చట్టములను అనుసరించి పరిపాలింపఁబడు దేశముయొక్క యేలుబడి ధనికులకును, దరిద్రులకును, పండితులకును, పామరులకును, ప్రభువునకును, ప్రజలకునుకూడ సదా శ్రేయోదాయకమై యుండితీరును అను వాదము సహేతుకమే! కాని ఆ చట్టముల అనుసరణము ప్రత్యక్ష జీవితమున ఎంతవఱకు ఆచరణలో నుండెనో యిదివఱకే గమనించియుంటిమి. అయినను ప్రస్తుతము పాశ్చాత్య భూములందు గమ్యార్థ సూచకమైనట్టియు మేఘగంభీరధ్వనితో అమెరికారాజ్యమువారిచే చేయఁబడిన మహాప్రకటనమందుగలట్లు "ఈదేశపరిపాలనము ప్రజలచేత ప్రజలలాభముకొఱకై నడుపఁబడవలయును" అను వాక్యమునందు తుదకు ప్రతిధ్వనించునట్టియు "ప్రజలు తమ దేశపరిపాలనమున పలుకుబడి గలవారై యుండవలయును" అను ధర్మసూత్రము ప్రాచీన హిందూదేశమున బొత్తుగ పాటింపబడలేదనుటకును వీలులేదు. చిన్నచిన్న స్వతంత్రరాష్ట్రములు దేశమంతట అచ్చటచ్చట ఉన్నట్లు యవనప్రవాసకులు కనిపెట్టియున్నారు. మఱియు అట్టివానినిగూర్చి బౌద్ధగ్రంథములందు పెక్కుచోట్ల వ్రాయబడియున్నది. గ్రామపంచాయతుల రూపమున స్వరాజ్యాంకూరములు కలవనుటకు ఎంతమాత్ర

మును సందియము లేదు. హిందూదేశమందు పెక్కుచోట్ల అవి యిప్పటికిని కానంబడుచున్నవి. అయినను ఆ అంకుర ములు అంకురములుగ మాత్రమే నిలిచిపోయినవి. ఆ విత్త నము భూమిపై నాటఁబడినను వృక్షముగ ఎన్నఁడును పరిణ మించి యుండలేదు. స్వరాజ్యోద్యమము గ్రామపంచాయతి పద్ధతియను అంకురపుస్థితిని దాటలేదు. సామాన్యధర్మముగ సంఘమునందు ఎన్నఁడును అది వ్యాపించలేదు.

మతసమాజములలో బౌద్ధమతవాసులగు సన్యాసు లందు స్వరాజ్య ధర్మము పూర్ణముగ వర్థిల్లినది అనుటకు మిక్కుటమగు దృష్టాంతములు కలవు. స్వరాజ్య ధర్మములును, పంచాయతి పద్ధతియు ఎట్టి అధికారముతో 'నాగా' సన్యాసు లందు వర్థిల్లుచుండెనో, వారికీపంచాయితీపాలనమందు ఎట్టి గౌరవముగలదో, ప్రతి 'నాగా'యును తన శాఖయందు ఎట్టి వ్యష్టిస్వత్వములను (Individual rights) చెల్లించునో, యెంతమాననీయమగు నిర్మాణసామర్థ్యమును, సమష్టికార్య ధురంధరతయు వారియందు కానంబడుచున్నదో చూచిన యెడల మహాశ్చర్యము వొడమును!

బౌద్ధమతాగమనము అనెడు మహాప్రవాహమున దేశ మందలి యాజకాధికారము మునింగి నశించిపోవ, క్షాత్రి బలము ప్రబలమయ్యెను. బౌద్ధమతయాజకులు సంగ పరి త్యాగులై, భౌతికవిషయంబుల జోక్యముతీసికొనక, గృహంబుల విడిచి సన్యాసమును స్వీకరించి మఠములందు వసింపుచుండెడి వారు. శాపములతోడను, మంత్రాస్త్రములతోడను భీతిలఁ

జేసి రాజులను తాము లోఁబఱచుకొనవలయునను ఉద్యమము గాని ప్రయత్నముగాని వారియెడల కానరాదు. అట్టి ఉద్యమ లేశము ఎచ్చోటనైననుఉన్నను సఫలతనొందుటకు అవకాశము లేదయ్యె. ఏలయన బౌద్ధులు హవ్యభుక్కులగు దేవతలను, వారిసింహాసనంబులను పెకల్చివేసి, వారిని స్వర్గనివాసముల నుండి పడలాగిరి. దివ్యపురుషుడగు బుద్ధుని పాదములనొద్ద పూజలు సలుపుటలో ఒండొరుల మించఁ జూచుచు బ్రహ్మ ఇంద్రుల పదవులను పొందుటకన్న బుద్ధత్వము నందుట శ్రేయస్కరముగ ఎన్నఁబడియెను. మరియు బుద్ధత్వమునందుటకు ఎల్లరును అర్హులే. ఈజన్మయందు సయితము అది యెల్లఱకును లభ్యమే. దేవతల పదభ్రష్టత్వముతోపాటు వారిచేఁ పోషింపఁబడుచుండెడి యాజకుల ఆధిక్యతయు అస్తమించినది.

అందువలన రాజాధికారము అనెడు యజ్ఞాశ్వముయొక్క పగ్గములు వైదిక యాజకుని అధీనము తప్పగా, అనవరోధంబై అది యిచ్చవచ్చినట్టుల చెలఱేగడనయ్యెను. ఇక్కాలమునఁ ప్రధానాధిపత్యము, సామగానముచేయునట్టియు, యజుర్వేదానుగుణ్యముగ యజ్ఞముల సలుపునట్టియు యాజకులందుగాని ఒండొరుల సంబాధములేక తమతమ చిన్న స్వతంత్రరాష్ట్రములను ఏలుకొనుచుండు క్షత్రియరాజులందుగాని నిలవక, ఒక దఱినుండి మఱొకదఱివఱకు హిందూదేశమంతటను వ్యాపించి, వారిరాశిపరీత భూవలయంబంతటను నిరంకుశాధికారమును చెల్లించునట్టి చక్రవర్తులందు నెలకొనెను. ఈయుగమున విశ్వామిత్రవశిష్ఠాదులకు మారు చంద్రగుప్త ధర్మాశోకుడు మున్నగు

చక్రవర్తులు మార్గదర్శులై నిలిచిరి. బౌద్ధయుగమున భారత దేశముపై సామ్రాజ్యము సలిపిన ఈప్రభువులవంటి చక్రవర్తులు ఎన్నండును భారతదేశసింహాసనమును అధిష్ఠించి, దానిని మహోన్నత కీర్తిశృంగమున నిలిపినవారు లేరు. ఈయుగాంత మున రాజపుత్రుల అభ్యుదయమును, హిందూమతపునరుద్ధ రణమును ఘటిల్లెను. బౌద్ధమతము క్షీణతనొంది రాజపుత్ర బలము వృద్ధిగాంచినప్పుడు, భారతదేశసామ్రాజ్యముయొక్క వినిర్మలకీర్తిచంద్రికలు కళంకముఁ జెంద అయ్యది తుత్తునియలై అసమర్థులగు అనేకరాజుల అధికారముక్రిందికివచ్చెను. ఇకాల లమున యాజకుల అధికారము తిరిగి తలయెత్తెను. ఈసారి పూర్వమువలె రాజాధికారమునకు అవరోధముగ నుండక దానికి సహకారిణియై మెలఁగజొచ్చెను.

వేదయుగమున ఆరంభించి, తరతరములుగ పెరిగి, జైన బౌద్ధవిప్లవకాలమున గరిష్ఠదశనందినట్టి యాజకక్షత్రియజాతుల సంఘర్షణము ఈవిప్లవసమయమునరూపుమాసెను. ఈఅధికార ద్వయము పరస్పరమైత్రి కూర్చుకొనెను. కాని మహనీయమగా ఆ క్షత్రీయసమర సాహసముగాని, బ్రాహ్మణలక్షణమగు ఆ తేజోమయ దివ్యజ్ఞానముగాని కానరాదయ్యెను. ఇరుతెగల వారును తమసహజమహిమలఁ గోలుపోయియుండిరి. సహజ ముగనే వీరిమైత్రి తమతమ లాభతృష్ణం జూచుకొనుటకు మార్గ ముఁజూపె; మఱియు వారు తమసామాన్య శత్రువులను, ముఖ్య ముగ ఆకాలపు బౌద్ధులను, రూపుమాపుట మున్నగు హీన కార్యములందు తమసామర్థ్యమును వ్యయపఱచనారంభించిరి.

మఱియుఅట్టిమైత్రిచే సహజముగ పొసగుదుర్గుణములకెల్ల ఆల వాలమై, జనసామాన్యపు జీవరసములఁ పీల్చివేయుచు, శత్రు వులపై కసిదీర్చుకొనుచు, పరులసొత్తుల అపహరించుచునుండి, పూర్వరాజులచే కావింపబడిన రాజసూయాది వేదచోదిత క్రతువులఁ సల్పుటకై వృథాప్రయత్నములుచేసి, వానిని హాస్యాస్పదములుగ కూడ నొనర్చిరి. ఇందుకు ఫలితముగ కొండెగాండ్రచేతను ఇచ్చగాండ్రచేతను అలముకొనఁబడిరి. వారి కర చరణములు బంధింపఁబడగా అనంతములగు క్రతుకర్మలును మంత్రతంత్రములును ప్రబలె; పశ్చిమదిక్కునుండి దండెత్తి వచ్చిన మహమ్మదీయుల బారిఁబడి వారిచే వీరు సులభముగ అణచి వేయఁబడిరి.

వేదయుగమునాఁటినుండి క్షత్రియులతో ఆధిక్యత కొఱకై పోరుసలుపుచు వచ్చిన యాజకుల ప్రాముఖ్యత తర తరములనుండి సాగివచ్చుచుండ, క్షాత్రాధికారమునకు అవ రోధముగనున్న ఆ బలమును, శ్రీకృష్ణభగవానుఁడు తనభూ లోక యాత్రయందు అసామాన్యసామర్థ్యముంజూపి తాత్కాలిక ముగనైన అడఁచివేసెను. ఆబ్రహ్మణ్యబలము తనకు ఆలవాలం బగు భారతదేశమునుండి, జైనబౌద్ధవిప్లవములందు త
వేయఁబడెను. ఒకవేళ అది అతిదుర్బలమై తనవైరి
చెంతనే అడఁగియుండెఁగాఁబోలు! అట్టిబ్రాహ్మణ
రవంశము మున్నగు వంగడములవారి అధికార
పుత్రులు తలఁజూపినప్పుడు, తనపూర
తిరిగి సంపాదించుకొనుటకై కడపటియు

ఆధిక్యతను స్థాపించుకొనుకొఱకు ఇట్లు యత్నించుటలో, మధ్య ఆశియా నుండివచ్చిన భీకర విదేశీయతండములకుఁ పాదాక్రాంతమై, వారి అనుగ్రహము వడయనెంచి హేయకరములగు ఆచారములను నెలకొల్పినది. మఱియును ఈ బ్రాహ్మణులు మూఢవిదేశీయులను మోసముచే వశముఁచేసికొనుటే పరమ గమ్యార్థముగ చేకొనిరి. నూతనమంత్రతంత్రములఁ కల్పనచేసిరి. నవీనములగు కర్మలను క్రతువులను ఆచరణలోనికిఁ తెచ్చిరి. తుదకుఅటులఁ జేయుటలోఁ తమపూర్వపు జ్ఞానమును, బుద్ధిబలమును, సమర్థతను, చిరకాలార్జిత వినిర్మలశీలమునుకూడ నేలపాలుచేసిరి ఇవ్విధమున నీరు ఆర్యావర్తమునంతను నీచమును, అసహ్యమును, అపవిత్రమును, మూఢమునగు ఆచారకాండమను నెడు సుడిగుండమున ముంచివేసిరి. ఇట్టి ఆచారములను మూఢవిశ్వాసములను ప్రోత్సాహపఱచుటవలని ఫలమేమి? ఆత్మీయబలతేజములను కోల్పోయి (సంఘము) దుర్బలతమమయ్యె! అట్టిస్థితిలో పశ్చిమమునుండి వచ్చిన మహమ్మదీయదండయాత్ర అనెడు తుపానుయొక్క స్పర్శమాత్రాన సంఘము సహస్రఖండములగుట ఆశ్చర్యమా! కటా! అల బ్రాహ్మణప్రభ అంతమందె! ఎన్నఁడైనఁ తిరిగి తలఁజూపునో లేదో?

హమ్మదీయులు రాజ్యముచేయుకాలమున యాజ
నరుద్ధరణముబొత్తుగ అసంభవమయ్యెను. మహ్మదు
బల యాజకవృత్తికిఁ విముఖుఁడై, చట్టము
ను నిర్మించి పూర్ణపరియత్నమున దానిని

నిర్మూలము చేయఁజూచియున్నాఁడు. ముసల్మానుల యేలుబడియందు రాజే పరమగురువు; మతవిషయములందు అతఁడే ముఖ్యనియామకుఁడు; అతఁడు సామ్రాజ్యమును వహించినప్పుడు మహమ్మదీయలోకమునంతకు అన్నివిషయముల తానే మార్గదర్శిగ నుండవలెనని ఆశించెను. ముసల్మానులు యూదులను గాని క్రైస్తవులనుగాని అంతగ ఏవగింపరు; వారిని సద్భక్తిశూన్యులుగ భావించుటే పేరు వారియందుజూపు సాంద్రతమ నిరసనము. హిందువులను అన్ననో, అటులగాదు, హిందువులు ప్రతిమారాధకులగు నీచకాఫరులని వారి అభిప్రాయము; కాన ఈ జన్మయందు వారువధ్యులే! పరమందునకూడ నిత్యనరకప్రాప్తియేవారిగతి! ఈ 'కాఫరుల' మతగురువులగు యాజకులను ఎచ్చటనో మూలనడఁగి, జీవయాత్రగడపుచు అంత్యకాలమునకై వేచియుండ విడుచుటేవారు కావింపఁగల మహోపకారము! ఏనవాబునకైన మతావేశము ఎక్కుడైనచో 'కాఫరులవధ' అను మహాయజ్ఞమునకు ప్రయత్నములు సాగించెడివాఁడు!

ఒకవైపు మతాంతరులై భిన్నాచారముల ననుసరించు నవాబులందు రాష్ట్రీయాధికారము నెలకొనె; మఱొకవైపుసంఘమునకు స్మృతికర్తయగుచు నియామకుఁడై రాజుచెంతవర్తించు స్థానబలము యాజకునియొద్దనుండి తొలఁగె. మనువుమొదలగు వారి ధర్మశాస్త్రములకుమారుగ ఖురానును తదనుకూలమగు చట్టములును వెలసె. పారశీకయరబ్బీభాషలకు తావిచ్చి సంస్కృతము పదభ్రష్టయయ్యె. పరాజితులై హైన్యతబడిన హిందువులయొక్క మతగ్రంథములందును మతవిషయములందును మాత్రము సంస్కృతభాష వాడఁబడుచుండెను. బ్రాహ్మణోద్ధత్య

కనిష్ఠశేషంబగు పురోహితుఁడు వివాహాది సామాన్యకర్మలందుమాత్రము యాజకత్వము వహింపవలసినవాఁడయ్యె. అదియు మహమ్మదీయప్రభువులు కటాక్షించి అంగీకరించినంతవఱకే!

వేదయుగమునందును తత్సమీప కాలమునందును యాజకాధికారపీడనమువలన రాజన్యాధిక్యత ప్రకాశమునకు రాలేదు. బౌద్ధవిప్లవమున బ్రాహ్మణాధిక్యత నశించి వేసి క్షాత్రబలము ఎటుల గరిష్ఠప్రభనందెనో సూచియుంటిమి! బౌద్ధ సామ్రాజ్యమంతరించి మహమ్మదీయ సామ్రాజ్యము స్థాపింపఁబడులోపల రాజపుత్రులసాహాయ్యమున క్షాత్రబలమొకవలఁతలఁ జూపఁ ప్రయత్నించి విఫలతనొందెనో కనుగొంటిమి. వైదికపురోహితులు పూర్వపు కర్మతాచారములను నూతనోజ్జీవముతోఁడ పునఃస్థాపనఁ చేయయత్నించుటయే యీవిఫలతకును మూలమని తెలిసికొనవచ్చును.

బ్రాహ్మణాధిక్యతను అణఁగఁద్రొక్కి-యు, మౌర్య, ఆంధ్ర, గుప్త * క్షాత్రపవంశపు చక్రవర్తుల అసమానప్రతిభను మహమ్మదీయప్రభువులు కొంతవఱకు తిరిగి పైకితీసికొని, రాఁగలిగిరి

కుమారిల, శంకర, రామానుజులు పునరుద్ధారణము చేయఁ ప్రయత్నించినట్టియు, కొంతకాలమువఱకు రాజపుత్రుల ఖడ్గబలముచే వర్ధిలి, జైన బౌద్ధ వైరులు క్షీణించిన వెనుక తిరిగి పునర్నిర్మాణమునకై యెదురుచూచినట్టియు, యాజకాధిక్యత మహమ్మదీయుల పాలనముక్రింద పునఃప్రబోధము నెఱుఁగని

* క్షాత్రపులు:—ఆర్యావర్తము, గుజరాతు రాష్ట్రములను ఏలిన పారశీకపు ప్రభువులు.

పెద్దనిష్ఠురముజొచ్చెను. ఈకాలమునందు రాజులకును పురోహితులకును వైరముకలుగుటకుమారుగ రాజులకు రాజులకు పోరుకలిగెను. ఈయుగాంతమున (మహమ్మదీయయుగాంతమున) హిందువులప్రభ తిరిగి తలయెత్తి, మహారాష్ట్రులయు, సిక్కులయు సాహాయ్యమున కొంతవఱకు హిందూమతమును సిద్ధాంతరూపమున పునర్జీవింపఁ చేసెను, ఈపునరుద్ధరణమునను యాజకుల ఆధిక్యత ఎక్కుడుగ ఆచరణయందు కానరాలేదు. అందుకుమారుగ బ్రాహ్మణులనే సిక్కులు తమ సంఘమున చేర్చుకొనునప్పుడు, వారిబ్రాహ్మణచిహ్నములను బహిరంగముగ విడిచిపెట్టి తమ మతముయొక్క ప్రసిద్ధచిహ్నములను అవలంబించునటుల బలవంతపెట్టుచువచ్చిరి.

ఈతీరున రెండుబలములకును చిరకాలము పోరు జఱిగిన అనంతరము, ఈ భరతభూమియందు పూర్ణముగ అన్యమతావలంబులగు రాజులవలన క్షాత్రబలవిజయ నినాదంబులు అనేకశతాబ్దములవఱకు ప్రతిధ్వనించెను. ఈమహమ్మదీయ యుగానంతరము మఱియొకనూతన బలము రంగస్థలమునెక్కి భారత ప్రపంచ వ్యవహారములందుఁ తనమహిమఁజూప మొదలిడెను.

ఈనూతనబలము భారతదేశమందు దిగంతములవఱకు వ్యాపించినను భారతీయులు దానిచర్యను ఇంచుకంతయు కని పెట్టలేక విస్మయమందుచుండునంత అపూర్వమైనదిగనుండెఁ; దానిస్వభావమును చర్యలును భారతీయుల మనస్సునకు అత్యంతము నవీనముగనుండెఁ; దానివిజృంభణము ఊహ్యంబుగాదయ్యె; మఱియు దాని బలము అలంఘనీయమయ్యె. అట్టి

బలమెద్దియో యిపుడు హిందువులకుఁ జక్కగ దెలిసియే యున్నది. మనమిప్పుడు ఆంగ్లేయుల హిందూదేశాక్రమణముం గూర్చి చెప్పుకొననుంటిమి.

చిరకాలమునుండియు ధనధాన్యభాగ్యభోగ్య విశేషముల గూర్చిన భారతదేశపుఖ్యాతి అనేకులగు విదేశప్రభువులందు భారతదేశమును జయింపవలెనను పేరాశ జనించునటులఁ జేసెను. అన్యదేశీయులచేత భారతదేశము పెక్కుసారులు ఆక్రమింపఁబడెననుట సుప్రసిద్ధమేగదా! అట్టిచో భారతీయుల మనస్సునకు ఆంగ్లేయుల భారతదేశాక్రమణము అపూర్వముగఁ దోఁచెనని నుడువనేల ?

దివ్యప్రబోధబలముచేతను, విశాలమగు మతవిషయక జ్ఞానముచేతను, తుదకు అంతగ అవసరమైనయెడల ఘోర శాపములచేతను వెలయుసన్యాసి అనగా నిలువనీడలేని పరివ్రాజకుఁడు కినిసినచో బెదటి గడగడవణంకవలసిన వారైయ్యు కమగర్వితులగు రాజులను ఎందటినో భారతీయులుచిరకాలము నుండిచూచియుండిరిఅతిభీకరాయుధములచేతనుదండిబలగముల చేతను, విజృంభించిన రాజులమ్రోలఁ ప్రజలు, సింగముమ్రోల అతిదైన్యమునఁ జరించు గొఱ్ఱెమందలవలె చరింపుచు, నిరంకుశాధికార కలితములగు రాజాజ్ఞలను ఎదురాడక నెరవేర్చుచుంట భారతీయులు సర్వసామాన్యముగ ఎఱింగిన విషయమే.

ఇక ఇగ్లాండుదేశము ఎట్టిదోచూడుడు.

రాజునకేగాక రాజబంధువులందఱకును, తామెంతయు శ్రీమంతులైనను, అతిదీనతతో డగ్గరి, కరాంజలిబద్ధులై నిలచి జోహారు

లోనర్చు వైశ్యులచే నొప్పు అంగ్లదేశము! తమమాతృభూమికి అత్యంతదూరముననున్న భారతదేశమున వర్తకము చేయుటకై సముద్రములను మహాసముద్రములను దాఁటివచ్చి, తమ కుశాగ్రబుద్ధి బలముచేతను, ధనబలముచేతను మాత్రమే, చిర కాలమునుండి స్థిరముగ స్థాపింపఁబడియున్న సింహాసనముల మీఁది హిందూమహమ్మదీయరాజులను వశముచేసికొని, క్రమ క్రమముగ కనుబ్రామి వారిని తుదకు ఆటబొమ్మలుగ చేసినట్టి వైశ్యులదేశము. ధనముఁచూపి దాస్యమునకు ఒప్పించి భారత ప్రభులను, వారిసైన్యములను వారిపరాక్రమమును, వారి జ్ఞానమును, తమకై ప్రవహించు ధనవాహినుల బలపఱచు నిమిత్తము నియోగించిన స్వల్పసంఖ్యాకులగు వైశ్యులను పంపినదేశము. "ఛీ! నీచా! తొలఁగిపొమ్ము! ఉత్తమవంశు నెదుట నిలువసాహసించెదవే!" అని ఒకానొక ప్రభువుఁ గర్వోద్రేకమున పలుకగా ఆ నిరసనమును భరింపవలసిన కవి సార్వభౌముని కన్నట్టిదేశము. అట్టిబలవంతులగు ఉత్తమోత్తమ వంశీకులు కతిపయ దినములలోనే 'తూర్పుహిందూదేశసంఘ' మను పేర వఱలిన వర్తక కూటమువారి సేవయందు హిందూ దేశమువచ్చుటకు అంగీకరించుటే గాక, అయ్యదియే భూతల మున నరుఁడుపొందగల మహోన్నత పదవిగభావింపకాంచిన దేశము; నిజముగ భారతీయులు ఎన్నఁడును విని కని యెఱుంగని అద్భుత విషయము కాదా !!

నరునియందు సత్వరజస్తమో గుణములు ఎచ్చుతగ్గు అగుచుండుటంబట్టి బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రులుఅనెడు

నాలుగువర్ణములు నాగరికతగల అన్నిసంఘములందును ఎల్లెడలఁ గాన్పించుచున్నవి. అనుల్లంఘనీయమగు కాలగతినిబట్టి వారిసంఖ్యయు వారిప్రాముఖ్యతయు అనేకదేశములందు అనేకవిధములుగ మారుచుండును. కొన్నిదేశములందు ఈవర్ణములలో ఒకటి అధికారబలముల వలన ఇంకొకదానికంటె అతిశయముగ ఉండవచ్చును. ఒక్కొకకాలమందు ఈవర్ణములలో ఒకటి ఇంకొకదానికంటె ఎక్కువబలోన్నతిని కాంచవచ్చును. ప్రపంచచరిత్రమును పరిశీలించి చూచినయెడల, బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణములు నాలుగును క్రమముగ ఒకదానివెనుక ఒకటిగ, ప్రకృతిధర్మమును అనుసరించి లోకమున అధికారము చెల్లించుట భగవంతుని నిర్ణయమని తెలియును.

చీనావారు, సుమేరియనులు, బాబిలోనియనులు, ఈజిప్షనులు, చాల్డియనులు, ఆర్యులు, ఐరేనియనులు, యూదులు అరబ్బులు అను ఈపురాతనమహాసంఘము లన్నిటియందును, వారిచరిత్రయందలి ప్రప్రథమదశయందు, సంఘమునకు మార్గముచూపు ప్రథానాధికారము యాజకులగు బ్రాహ్మణులయందే యుండెను. రెండవదశయందు, నిరంకుశప్రభుత్వరూపమునగాని, కొందరు నియమిత పురుషులచే జఱుపబడు శిష్టజనపరిపాలన రూపమునఁగాని, క్షత్రియులుఅధికారము జఱిపిరి. నూతన పాశ్చాత్యసంఘుంబులకు శిరోభూషణమగు ఇంగ్లాండు మున్నగుదేశములందు వాణిజ్యవ్యాపారముచేసి ధనికులైన వైశ్యసంఘపువారి చేతులలోనికి ఇప్పుడు, మొదటిసారి అట్టి ఆధిపత్యాధికారములు వచ్చినవి.

పురాతనరాష్ట్రములగు ట్రాయి, కార్తేజియును, గ్రీసురోము ఎచ్చుతగ్గుగ ఆధునికరాష్ట్రములలో వెనీసును చాలప్రాముఖ్యత గాంచినను, బాగుగపరిశీలించుచో వానియందు వైశ్యుల అధికారము ప్రబలినదని చెప్పుటకు వీలులేదు.

సరిగ విచారించినయెడల ఆప్రాచీనదినములలో సామాన్యజనులను తమసేవకులను వర్తకముచేయ నియమించుటచేత, రాజబంధువులుమాత్రమే వాణిజ్యవిషయమున అనన్యాధికారమునువహించి (Monopoly) అందువలన వచ్చులాభమును తామేఅపహరించినట్లు తెలియగలము. ఈకొద్దిమంది తప్ప యితరులుఎవరును దేశపరిపాలనము మున్నగుసంగతులందును జోక్యము తీసికొనుటగాని తమఅభిప్రాయముల తెలుపుటగాని యెఱుంగరు. ఈజిప్టు మొదలగు మహాపురాతన రాష్ట్రములందు కొలదికాలముమాత్రమే యాజకులు నిరంకుశాధికారమును చెల్లించి, తదనంతరము రాజుయొక్క అధికారమునకు లోఁబడి, దానికి సహకారులుగ నుండిరి. చీనాదేశమున క్షాత్రబలమంతయు, కన్ఫూషియనుఅనువారి ధీమసవిశేషమున కేంద్రీకరణముగాంచి, యిరువదియైదు శతాబ్దములకు పైగా అవరోధంబనునది లేక అధికారము చెల్లింపుచు యాజకాధికారమును వశపఱచుకొని నడుపుచువచ్చెను. కడచినరెండు శతాబ్దులనుండి సర్వనియామకులగు టిబెటుదేశపు లామాలు, రాజకుటుంబమువారికి మతగురువులైనను, చీనాదేశపుచక్రవర్తికి అన్నివిధముల విధేయులై వర్తింపవలసినవారైయే ఉండిరి.

హిందూదేశమునందలి క్షత్రియులు ఇతర పురాణనాగరిక సంఘంబులకు చాలవెనుక, యాజకుల అధికారమును వశపఱచుకొని, తమనిరంకుశాధికారమును ప్రకటించిరి. కాన చీనా, ఈజిప్తు, బాబిలోనియా, మున్నగుసామ్రాజ్యములు నెలకొనిన చాలకాలమునకువెనుక హిందూదేశసామ్రాజ్యము స్థాపింపఁబడినది. యూదియాసంఘపు క్షత్రియులు అనుపమేయంబగు పట్టుదలజూపి యాజకులతోఁపోరి, తుదకు నిష్ఫలమనోరథులైరి. యూదులందు ఎన్నఁడును వైశ్యులుసహా ఆధిపత్యమును వహించియుండలేదు. ఇందుకుమారుగ సామాన్యజనులు యాజక బంధములనుండి తప్పించుకొన ప్రయత్నించి స్వసంఘమున ఉద్భవించిన క్రైస్తవమత వ్యాపకము మున్నగు మతసంస్కరణోద్యమముల వలనను, అన్యదేశములనుండి వచ్చిపడిన రోమకసామ్రాజ్య పీడనము వలనను మిగుల గోడుఁ జెందిరి.

ప్రాచీనకాలమున యాజకులు, చాలవఱకు పట్టుదలతో పెనుగులాడినను క్షాత్రబలమునకు లోఁబడవలసి వచ్చెను. అటులనే ఆధునిక కాలమున నూతనముగ ఆవిర్భవించిన వైశ్యబలోద్ధతికి ఓడి, కిరీటములు అనేకము నేలకూలె; రాజదండములు అనేకములు భిన్నములయ్యె. నాగరికముచే చెన్నారు కొన్నిదేశములందు ఇంకను కొలఁదిగ అధికారమును చెల్లింపుచు, రాజవైభవాతిశయముల ప్రకటింపుచున్న స్వల్ప సంఖ్యాకములగు సింహాసనములు, ఉప్పు, పప్పు, నూనె, చింతపండు అమ్ముకొను వైశ్యసంఘంబుల అగణిత ధనరాసులచేత

నిజముగ పరిపాలకులగు ఆ వైశ్యుల ఘనకీర్తులకొఱకై యే, చూపులకుమాత్రము తేజోవంతములుగను గంభీరముగను, నిలుపబడి ప్రదర్శింపఁబడుచుండెను.

దేని ఆజ్ఞచేత విద్యుచ్ఛక్తి ఒక ధ్రువమునుండి మఱొక ధ్రువమునకు, ఒక్కక్షణములో వర్తమానముల కొనిపోవునో, కొండలంతేసి అలలతో ఒప్పు సముద్రము దేనికి రాజమార్గ మయ్యెనో, దేని ఉత్తరువుచేత అతిసులభముగ భూగోళమున ఒక భాగమునుండి వేఱొక భాగమునకు వివిధసంభారములు కొనిపోఁబడు చుండెనో, దేని అధికారదృష్టికి చక్రవర్తులుసహా వణకుచుంద్రో, అట్టి నూతనావిర్భూత వైశ్యబలమునకు చిహ్నమగుచు, తెల్లని నురుగులు గ్రక్కు పెద్ద అలనుబోలి, సర్వవిజయంబై దేదీప్యమానంబుగ వెలుంగుచు, మహావైభవ ముననొప్పు ఆంగ్లసింహాసనము సుస్థాపితమయ్యె !

కాబట్టి ఆంగ్లేయుల వలని హిందూదేశాక్రమణము, మనకు పలుమాఱు బోధింపఁబడు నటుల క్రీస్తువలనఁగాని బైబులు వలనఁగాని (అనఁగా క్రైస్తవమత బలముచేత) సంభవించినదికాదు; మొగలులు పఠానులను జయించినటుల జయించుటవలన కైవశమైనదియుకాదు. క్రీస్తుప్రభువు, బైబులు అను నామములకును, మహావిరాజమానమగునగరములకును గజరథాశ్వపదాతి బలగములయొక్క భూకంపిత సాంద్రపాద ధ్వానములకును, సాంగ్రామిక భేరీపటాహ తూర్యాదిరావంబులకును, జేగీయమానంబై వెలుఁగు రాజసింహాసనమునకును వెనుక మూలాధారమగు ఇంగ్లాండు ప్రత్యక్షమై నిలిచియున్నది !

కర్మశాలల పొగగొట్టములు ఎవరిరణధ్వజములో, వణిగ్వరులు ఎవరిసైనికులో, జగమునందలి వర్తకస్థానములుఅన్నియు ఎవరి యుద్ధరంగములో, యెవరిరాజ్ఞి * ధనలక్ష్మి అపరావతారమో అట్టి దేశము సుమీ యింగ్లాడు సీమ !! ఈకారణమువలననే, ఈ ఆంగ్లేయుల హిందూదేశాక్రమణము మనమెన్నడుఎఱుంగని వింతవిషయము అని వక్కాణించితిని. ఈ భీమబలముతోడి డీకొనుటవలన హిందూదేశమున ఎట్టివిప్లవముజరుగనుండెనో, ఆ విప్లవము కారణముగ ఎట్టి మార్పులు రానున్నవో, మన దేశపు పూర్వచరిత్రనుబట్టి గ్రహింప నలవిగాదు సుడీ!!

బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణములు ఒకదాని వెనుక నొకటిగ జగమును పాలించునని యిదివఱకే నుడివి యుంటిని. ఈవర్ణములలో ప్రతివర్ణమును అధికారము చెల్లించు కాలమున ప్రజలకు లాభకరములగు కార్యములు కొన్నియు అనర్థదాయకములగు కార్యములు కొన్నియు జఱుగుచుండును.

యాజకబలమునకు మూలాధారము బుద్ధిబలముగాని స్థూలరూపమగు ఆయుధబలముకాదు. కాఁబట్టి యాజకబలౌద్ధత్యముతోడ బుద్ధిపరిశ్రమయు సాహిత్యసంపాదనయు అత్యంతము వృద్ధియగును. ప్రతిమానవుని హృదయమును ఇంద్రియాతీతజగముతో ప్రసక్తిగలిగి లాభములబడయుటకై ఆతురపడు చుండును. ఆలోకమున ప్రవేశించుటన సామాన్యజనమునకు సాధ్యమగునదికాదు. ఇంద్రియాదులను పూర్ణముగజయించి,

* విక్టోరియారాజ్ఞి. ఇది ఆమె బ్రతికియుండగ వ్రాయబడిన వ్యాసము.

సత్వగుణప్రధానమగు స్వభావముగలకొలఁదిమంది మహాత్ములు మాత్రమే దుర్భేద్యమగుస్థూలప్రపంచమునుదాఁటి యింద్రియాతీతమగు ఆలోకమును ప్రత్యక్షముగ చూడఁగలరు. అట్టివారు మాత్రమే ఆప్రపంచవర్తనమును ఎఱింగి, దానినుండి సందేశములను తెచ్చుచు, ఇతరులకు మార్గదర్శులు కాగలరు అట్టి దండిమహాత్ములు మానవసంఘములకు యాజకులుగను, ప్రప్రథమగురువులుగను, నాయకులుగను, ఉజ్జీవనప్రేరకులుగను ఉందురు. వారు దేవతలను ఎఱుఁగఁజాలుదురు; వారితోడ ప్రసంగింతురు; అందువలనవారు దేవతలుగ పూజింపఁబడుదురు. ఐహికవాంఛల విడచినవారగుటంజేసి, వారు నోసటి చెమటరాల్చి జీవనోపాధిని సంపాదించుకొను అవసరము లేదు. ఆహారపానాదులందు ఉత్తమభాగము ప్రథమమున దేవతలకు అర్పింపఁబడును; భూమిని దేవతల ప్రతినిధులై నిలచినది యాజకులేగదా! కాన వీరినోరుల ద్వారమున ఆదేవతలు నైవేద్యముల గ్రహింపుచువచ్చిరి. తెలిసియో తెలియకయో సాంఘికులు యాజకునకు మిక్కిలివిశ్రాంతినిత్తురు; అందునంజేసి అతఁడు స్వాభావికముగనే మననశీలుఁడై ఉత్కృష్ట విషయములగూర్చి యోజింపఁగలఁడు. కాననే యాజకులు ఉచ్చదశనున్నప్పుడు జ్ఞానవిద్యాభివృద్ధులుకలుగుచు వచ్చెను. ఒకవైపున భీకరసింహంబగురాజునకును రెండవవైపున అతిభీరువులై గొఱ్ఱెలమందయనందగు ప్రజలకును మధ్య ఈయాజకుడు నిలచును. ఆసింహము జంతువధకై లంఘించుతఱిని ఈయాజకు తన కరమందలి దివ్యజ్ఞానదండమును చూపి నిరోధింపు

చుండును. ధనముం గూర్చియు సైన్యములం గూర్చియు గర్వాంధుడైన రాజుయొక్క నిరంకుశాధికారాగ్ని తన మార్గమునవచ్చు సర్వమును భస్మీపటలము కావింపజాలును. ఐనను ధనబలముగాని సైన్యబలముగాని లేకయే, దివ్యజ్ఞానబలముచే చెన్నారు యాజకుని నోటినుండివచ్చు ఒక్కమాట చాలదా, రాజు నిరంకుశాధికారమును, జలములు అగ్నిని చల్లార్చునట్లు చల్లార్చుటకు! ప్రథమనాగరికోదయము అనగా పశుత్వముపై దేవత్వముపడసిన ప్రథమవిజయమేఇది;జడపదార్థముపైని ఆత్మయొక్కవిజయము! నైజముచే దాస్యమున పఱగు ఈ శరీరమను మాంసపుముద్దయందు గుహ్యమైయున్న దివ్య తేజోబలముయొక్క ప్రథమప్రకాశము ఆ యాజకబలాతిశయముతోడ కాననయ్యెను. యాజకుడే మొట్టమొదట ఆత్మానాత్మవివేకము ఒనర్చినవాడు; ఇహపరముల రెంటిని సమావేశముచేసినవాడు; ప్రప్రథమున భగవదాదేశమును ప్రజల కొసంగినవాడు; రాజునకును వానిప్రజలకును మధ్యవర్తియైనవాడు! సర్వజగత్క్షేమాంకూరము, వాని ఆధ్యాత్మికబలముచేతను సుజ్ఞానవిద్యాభిమానముచేతను, వానిజీవిత ధర్మసంజ్ఞాపదమగు ( Motto ) వైరాగ్యమువలనను పోషింపఁబడి, మఱియు వానిజీవనరస ప్రవాహముచే తడుపబడుచున్నది. ఆకారణమువలననే ప్రతిదేశమునందును యాజకుడు ప్రప్రథమమున పూజింపబడుచున్నాడు. కావున వాని స్మరణయు మనకు పావనమైనదే!

అనర్థములును కొన్నికలవు. జీవాంకూరముతో మరణాంకూరముకూడ నాటబడుచున్నది. చీకటి వెలుగులు రెండును ఎల్లప్పుడును తోడుగనే యుంటున్నవి. సకాలమున తొలగించనిచో సంఘమును నిర్మూలముచేయు గొప్ప అనర్థములు కలవు. జడపదార్థద్వారమున శక్తిప్రకాశించుచుంట సర్వసామాన్యముగ అనుభవవేద్యమైన విషయము. గండ్రగొడ్డండ్ల యొక్కయు ఖడ్గములయొక్కయు ప్రయోగమునను, అగ్ని యొక్కయు పిడుగుల యొక్కయు దగ్ధక్రియయందు ప్రకాశమునకువచ్చు మహాచ్ఛక్తిని ఎల్లరును గుర్తింపగలరు. వీనింగూర్చి ఎవరును సందేహింపరు. వాని సత్యత్వముంగూర్చి యెవరును ప్రశ్నింపరు. మఱియు ఆశక్తికి ప్రధానాశయమును, దాని ప్రయోగస్థానమును మానససీమ ఐనప్పుడును, అనగా కొన్ని ప్రత్యేక శబ్దములందును, వానిప్రత్యేక పఠనరీతులందును, దుర్గ్రాహ్యంబులగు బీజాక్షరములను మనసున మననము జేయుటయందును, లేక అట్టి మానసికములౌ క్రియలందును మాత్రమే ఆశక్తి ఆవిర్భవింప నున్నప్పుడును, అచ్చట చీకటి వెలుతురులు సమావేశమగును. సాంద్రమగు భక్తి అచ్చట అటుపోటులచే చలించుచుండును. ప్రత్యక్ష పరోక్షానుభవములచేత చూడబడు విషయంబులందుగూడ సంశయములు కలుగుచుండును. బాధ, భయము, కోపము, మత్సరము, క్రోధము మొదలగు మానుషావగుణములు ప్రేరేపించు ఉద్యమమును నెరవేర్చు సాధనముగ ప్రతివానికిని గ్రాహ్యముధబలమును విడిచి, స్థూలరూపమగు సాధనము

లను అన్నింటిని విడిచివేసి, తమప్రయోజనమునకై కడుదుర్గ్రాహ్యమగు * స్తంభన ఉచ్చాటన వశీకరణ మారణక్రియలనెడు మానసికసాధనంబులను ప్రయోగించుచో అట్టిపురుషులు తమమానస సీమలు ధూమముంబోలు కళంకమేఘాళిచే ఆవణంబులుకాగా గుప్తమాయాభూయిష్టమగు ప్రపంచమున జీవించుచువారగుదురు. వారి మనములకెన్నడును ఋజుమార్గము కాన్పించదు. ఒకవేళ కనిపించెనుపో వారిమనసు దానిని ఏదో వక్రగతికే ఈడ్చును. ఇందుకు ఫలముగ అవిశ్వసనీయతయు, సంకుచిత చింతనమును సంభవించును. అన్నిటికంటెమించి, పర శ్రేయమును మత్సరముతో జూచు అసహిష్ణుత జనించి విఘాత హేతువగును. "దేవతలనుసహా నాకు లోబఱచినట్టియు, శారీరక మానసిక బాధల నిర్జింపఁజాలునట్టియు, భూతప్రేత పిశాచముల ఉపచర్యల లభింపఁచేసినట్టియు, నాసామర్థ్యమును నేనుఏలవిడువవలె? అత్యంత వైరాగ్యకలితుఁడనై కష్టపడిదాని సంపాదించితిని. నాకు సంపదను పేరుప్రఖ్యాతులను తుదకు ఐహిక సౌఖ్యానందములను అన్నింటిని అర్పించి నేను సంపాదించిన దానిని ఇతరులకు ఏల యీయవలె?" అనుచు యాజకుడు తలంచును. మఱియు ఆశక్తి పూర్ణముగ మానసికమైనది; దానిని కడు గుప్తముగ ఉంచుటకు అనేక ఉపాయములు కలవు. ఇట్టి సందర్భచక్రమునందుచిక్కి మానవ

* స్తంభనమన ఇంద్రియ నిశ్చేష్టిత్వము; ఉచ్చాటన మన ఒకని చెఱచుట, వశీకరణ మన ఒకనిని తనకు లోబఱచుకొనుట, మారణమన ఒకనిని చంపుట. ఈక్రియలన్నియూ గుప్త మంత్రోచ్చారణచేఁ జరుగును.

స్వభావము గడవరాని దుస్థితింబడును; ఆత్మ సదా గోప్య వర్తనమునకు అలవాటుపడి, స్వప్రయోజన పరత్వమునకును, కృత్రిమమునకును పాలై, తుదకు వానివలనఁ తప్పక కలుగు విషఫలంబులను అనుభవించును. కాలానుసరణిని ఈ గోప్య భావమునకు ప్రతిఫలమును తానే అనుభవించును. వ్యవసాయమును (సాధనయు) వ్యాపకమును లేక తెలివియంతయు, జ్ఞానమంతయు నశించును. ఏమైన నిలిచియుండుచో అది అపౌరుషేయ మార్గమున కలిగినట్లు భావింపబడి, కల్పనాసామర్థ్యమును సంపాదించుటకుఁగాని నూతనశాస్త్రముల నేర్చికొనుటకుగాని ఉపయోగింపఁబడదు. నిరర్థకమనికూడ తలంపబడును. ప్రాతవిజ్ఞానమేమైన మిగిలియున్నను దానిని మాలిన్యముల తొలగించి బాగుచేయుటయు అనుపయోగకరమని యెంచబడును! ఇట్లు యాజకుడు పూర్వపు జ్ఞానమును, నిరాఘాటమగు స్వాతంత్ర్యమును కోలుపోయి, పూర్వీకుల పేరుమాత్రము చెప్పుకొని గర్వించుచు, వారికిగల ప్రతిభను, ఆధిక్యతను, పూజ్యతను, ఔన్నత్యమును అనుభవింపవలయునని వృథాగా పెనుగులాడుచుండును. కావున అతఁడు ఇతర వర్ణములవారితో సహజముగ విరోధము పెట్టుకొనుచుండును.

ప్రకృతిధర్మమును అనుసరించి, నూతన మగునట్టియు బలతరమగునట్టియు ఉజ్జీవముఎచ్చటెచ్చట చూపట్టునోఅచ్చటనెల్ల ప్రాతబడి ఖిలమగుచున్న దానిని అది అడచివేయుచు దానిస్థలమును తాను ఆక్రమించుకొనుచుండును. అనర్హమైనది నశించుటకును, అర్హమగునది నిలచియుంటకును ప్రకృతి

తోడ్పడుచుండును. యాజక జాతికిని నితరజాతులకును కలిగిన కలహాములయొక్క తుది పర్యవసానము ఇదివఱకే తెలుపబడెగదా!

ఉచ్చదశయందు తత్త్వాన్వేషణమునకై ఉపయోగింపఁబడిన యాజకుని వైరాగ్యము, ఆత్మనిగ్రహము, సంగ పరిత్యాగమును నీచదశ సంప్రాప్తమగుతఱిని అతడు తన భోగముల బలపఱచుకొనుటకు, ఇతరులకంటె తాను అధికుడైనట్లు ప్రకటించుకొన ప్రయత్నించుటకు వినియోగించునవయ్యెను. సర్వగౌరవమును, పూజ్యతయును వానియందే కేంద్రముకాంచునటుల చేసిన అధికారము ప్రస్తుతము ఊర్ధ్వలోకమునుండి అధోలోకమున అట్టడుగునకు పడఁద్రోయఁబడెను. సన్మార్గము తప్పి, త్రోవగానక చరింపుచు, తనచేతనే అల్లుకొనఁబడిన గూటియందు చిక్కుకొనిన సాలెపురుగు లీల, యాజకాధిక్యత చిక్కులం తగుల్కొనెను. ఇతరులకాళ్లను బంధింప తరతరములనుండి జాగ్రత్తమెయి సిద్ధము చేయఁబడిన సంకెళులు, తననే వేయిరెట్లు గట్టిగబంధించి, సహస్రవిధముల తనకే అవరోధముగ నుండెను. సంఘమును పలువిధముల బంధించి, యినుపగొలుసులతో కట్టివేసియుంచుటకై, శారీరక మానసిక శుద్ధ్యర్థమైన బాహ్యసాధనములుగనలు ప్రక్కలను అల్లిన అనంతమగు యజ్ఞయాగాదిక కర్మలు ఆచారములు అనెడు ఉరులందు తానెతగుల్కొనెను. యాజకాధిక్యతయిట్లు ఆపాదమస్తకము బంధింపఁబడి, నిస్సహాయతనుబడి ఆశానిష్ప్రహత్వము చెంది నిద్రంబడెను! ఇప్పుడు తప్పించుకొను మార్గము కాన

రాదు! ప్రతిమానవుని హృదయమునందును పురోవృద్ధివాంఛ పాదుకొనియున్నది; కాన యాజకవృత్తియొక్క చిక్కమునందు తగుల్కొని యున్నంతవఱకు ఈకోరిక ఫలింపదని తెలిసికొనిన బ్రాహ్మణులే వానిని త్రెంచి ఇతరవర్ణములవారివృత్తులనుఅవలంబించి ధనమును ఆర్జింతురు. సంఘముఅప్పుడువారికి యాజక స్వత్వములను అంగీకరింపదు. శిఖనుధరించుటకు మారుగ,శిరోజములనుతీసివేసి, పూర్వాచారములను పెద్దలఅభ్యాసములను మాని సగముపాశ్చాత్యుల విధమున దుస్తుల ధరింపుచు, పాశ్చాత్యులు నూతనముగ తెచ్చిపెట్టిన అనుచారములను అవలంబింపుచు బహుజాతీయతతోఒప్పుచుండుబ్రాహ్మణనామధారుల బ్రాహ్మణత్వమునందు సంఘమునకు విశ్వాసముండదు! మఱియు భారతదేశముననూతనముగసాగిన ఆంగ్లేయప్రభుత్వము నవీనవిద్యావిధానముల స్థాపింపుచు, ధనాకర్షణకై అపూర్వ మార్గముల చూపుచునుండు ప్రాంతములందెల్ల, బ్రాహ్మణ చిన్నవాండ్రు తండోపతండములుగ, తరతరములనుండి వచ్చుచున్న తమ యాజకవృత్తిని విడిచి, జీవనోపాధిని సంపాదించుకొఱకు, ఇతరవర్ణములవారి వృత్తులను అవలంబించి ధనికులుకాచూతురు. ఇందుకు ఫలమేమగును? పూర్వులయొద్దనుండి తరతరములుగావచ్చుచున్న యాజకాభ్యాసానుచారములు దిక్కు కొనలకు ఎగరిపోయి దేశమునుండియే అదృశ్యము లగును!!

చాలప్రాంతములంగల బ్రాహ్మణశాఖలలో సగము, రెండేసిఅంతశ్శాఖలైచీలి, అందు మొదటివారుయాజకవృత్తియందే నిలిచియుండ, రెండవభాగమువారు అన్యవృత్తులవలన జీవించు

చున్నారు. ప్రతిశాఖయందలి ఒక అంతశ్శాఖవారు యాజక వృత్తిలోనేయుండి బ్రాహ్మణు లనఁబడుచున్నారు. రెండవ అంత శ్శాఖవారును బ్రాహ్మణ సంతతివారైనను వీరితో మొదటి శాఖవారు సంబంధములఁ చేయరు. ఇందుకు తార్కాణముగ 'వైదిక బ్రాహ్మణులు' అనగా యాచన జేయుచుయాజకవృత్తినున్న బ్రాహ్మణులనియు, 'నియోగులు' అనగా రాజకీయోద్యోగములం దున్నట్టిగాని, వాణిజ్యవ్యాపారముం జేయుచు వైశ్యవృత్తియందు న్నట్టిగాని బ్రాహ్మణులనియు వాడుకవచ్చినది. ఐనను ఈభేదము చిరకాలము ఉండునది కానట్లు కాన్పించుచున్నది. ఏలయన 'వైదిక బ్రాహ్మణ చిన్నవాండ్రు' సయితము ఈకాలమున ఇంగ్లీషువిద్యను అభ్యసించి రాజకీయోద్యోగములను స్వీక రించుటయు ఏదోవర్తకవ్యాపారము చేయుటయు మొదలిడిరి. కేవలము పూర్వాచారపరాయణులగు పండితులుసహా ధన విషయిక వాంఛలవలన తమబిడ్డలను ఆంగ్లేయకళాశాలలకు పంపుటయు, వైశ్యక్షత్రియశూద్రవృత్తులుమున్నగు బ్రాహ్మణే తరవృత్తులందు ప్రవేశపెట్టుటయు చూచుచున్నాము. ఈరీతిని కొంతకాలముగడచినచో, ఇంక యాజకవర్గము హిందూదేశము నందు ఎంతకాలము నిలువగలదు? అను విషయము శ్రద్ధతో విచారింపవలయు సమస్య కాగలదు. యాజకవర్గము యొక్క ఆధిక్యతను రూపుమాప యత్నించుట అను దోష మును తమయందుగాక, యితరుడగు నొకపురుషునిమీఁదగాని ఒకసంఘముమీఁదగాని ఆరోపింపఁజూచు బ్రాహ్మణులు ప్రకృతి ధర్మమునకులోబడిపోయిన బ్రాహ్మణవర్ణముస్వయముగనే తన

సమాధిని తానె త్రవ్వుకొనుచుండెనని గ్రహింతుగాక! అది అటుల జరుగవలసినదే! ఉత్కృష్ట జన్మయనియు, అధికార ఘనతలనియు విఱ్ఱవీగువర్ణములున్నియు తమచితిని తమహస్తములతోడనే పేర్చుకొనుట శ్రేష్ఠమును ఉచితమును అగు పనియేసుడీ!

ఒకఁడు యోగ్యతనుసంపాదించుట యెంతఅవసరమో, వాడు దానిని ఇతరులకుపంచి యిచ్చుటయు అంతఅవసరమే. పంచియిచ్చుటే యెక్కువ ఆవశ్యకమైనదని నుడువవచ్చును. హృదయమునందు రక్తము కూడుకొనుట జీవించుటకు ముఖ్యావసరము. కాని అది శరీరమంతటను వ్యాపింపనిచో మరణముతప్పదు. ఒక్కొకకాలమందు విద్యయు అధికారమును కొన్నికుటుంబములయందుగాని, వర్ణములందుగాని యితరులకులేకుండ, కూడుకొనియుంట సంఘమునకు శ్రేయోదాయకమే; కాని ఆ అధికారము తాత్కాలికముగ అచ్చటఉన్నను ముందుముందు సంఘమున అంతటను అది వ్యాపించవలెను. అట్టివ్యాపకము అడ్డగింపఁబడినచో ఆసంఘముయొక్క వినాశము త్వరలోనే కలుగును అనుటకు సందియములేదు.

మఱియు రాజు సింహమువంటివాడు. మృగరాజునందుగల సదసద్గుణంబులు రెండును రాజునందు కలవు. అవసరమైనప్పుడు,తనరక్తపిపాసనుతీర్చుకొనుటకై ఆకులలములతిని బ్రతుకు సాధుజంతువుల హృదయములను అది చీల్చకుండ, ఎప్పుడును తనగోళ్ళను ముడుచుకొనియుండదు; మఱియు ఒక

కవివరుండు ఇట్లు వర్ణించియున్నాఁడు— "వృద్ధాప్యముచేతను క్షుద్బాధచేతను ప్రాణములు పోనున్నను సింహము ఎన్నఁడును తన శరణుచొచ్చిన దుర్బలమగు తోడేలును చంపనోపదు." రాజను సింహము ఇంద్రియలోలత్వమునచరించుచో వానిప్రజలలో ఎవరేని ఒక్కక్షణము ఆయనకు అడ్డమువచ్చినయెడల వానిచావుమూడినట్లే;—విధేయులై ప్రజ వాని యాజ్ఞలకు శిరములవంచిరేని, వారికెన్నండును అపాయము లేదు. ఇంతేల; ప్రాచీనకాలపు సంగతిని విడిచిపెట్టుము: ఇక్కాలమునగూడ అనేకుల క్షేమముకొఱకు సార్థకముగ స్వార్థత్యాగముచేయుటయు, సంఘమంతటియొక్క మేలుకొఱకు ప్రతిసాంఘికుఁడును ఏకీభావముపూని పాటుబడుటయు శ్రేయమని పూర్ణముగ గ్రహించి వర్తించు సంఘము ఒక్కటియు ఏదేశముననుకాన్పించుటలేదు. కాన ఈసంఘస్థితిని బట్టిచూడ రాజులుండుటఅవసరముఅనియేతోఁచుచున్నది. సంఘమున విచ్ఛలవిడివర్తించు అధికారములన్నియు రాజులందు కేంద్రించి ( సమావేశమై ) అచ్చటనుండి బయలుదేరి దేహరూపమగు సంఘమంతటను వ్యాపించును. ప్రప్రథమదశయందు బ్రాహ్మణాధిక్యత మెండుగనున్నప్పుడు, తత్వజ్ఞానాన్వేషణమునకై ఆరంభప్రయత్నములు చేయబడినను ఆ అన్వేషణాంకూరములు తరువాతనుగూడ శైశవమునందె ఉండిపోయెను. కాబట్టి క్షాత్రాధిక్యత తలజూపిన ప్రథమదశయందు ఇంద్రియభోగవాంఛలు తలయెత్తి, నెమ్మది నెమ్మదిగ ఆ వాంఛలు సఫలములగునటుల నూతన విజ్ఞానములును కళ

లును, శాస్త్రములును వెలసెను. రాజు తన మహోన్నత దశ యందు గర్వితుఁడుగాక, నమ్రతతో పేదవారి కుటీరములందు తలదాచుకొనునా? మఱియు సామాన్యజనులు తిను పదార్థములు వానికి హితవై తృప్తినిచ్చునా?

రాజుయొక్క గౌరవమునకును, పుడమినిగల మఱి ఏయితరపురుషునిగౌరవమునకును పోలికయే లేదు. రాజుయొక్క దేహమనెడు ఆలయమున ఈశ్వరుడే వసింపుచుండును. అట్టి వాని భోగ పదార్థములను కన్నెత్తిచూచుటయు దోషహేతువే! అట్టివానిని అనుభవింపజూచు మాటచెప్పనేల? రాజు యొక్క దేహము ఇతరజనుల దేహమువంటిదిగాక, పరమ పావనమైనదే అమాంగల్యము వలనను కూడ అపవిత్రము కానిదయ్యెను. కొన్ని దేశంబులందు రాజునకు చావును లేదని నమ్మెదరు. రాజుభార్యయు అంత పావనమైనదే. కాబట్టి ఆమెను జనసామాన్యము చూడకుండ కాపాడుదురు; సూర్యుఁడు సయితము ఆమె సౌందర్యమును వీక్షింపవలదు. అందువలన కుటీరములు పోయి రమ్యతర హర్మ్యములు నెలకొనినవి. స్వర్గమునుండి వచ్చెనో అనునట్లుండు మధురగానములు ప్రజలకలకల ధ్వనులను కప్పివేయుచుండెను. నైసర్గికములగు మిట్టపల్లంపు టడవులు, అనాగరిక జనుల మోటుబట్టలును క్రమక్రమముగా పోయి మనోహరములగు ఉద్యానవనములు, రమ్యములగు తోపులు, సుందరములగు చిత్రశాలలు, కంటకింపగు ఛాయాపటములు, విలువగల సన్నంపు దుస్తులును వెలసె! వేలకొలఁది బుద్ధిమంతులు కృషీవళుల

కష్టపు జీవితములవిడచి, చిత్రకళలకై తిరిగి తేలికయగునట్టియు, సుఖతరములగునట్టియు వృత్తులందు తమ చమత్కృతులను ప్రకటింపసాగిరి. పల్లెలకుఁ ప్రాముఖ్యత తప్పెను; నగరములు వెలసెను.

రాజులు కొంతకాలము ఇట్లు ఐహిక భోగములను తనివి తీర అనుభవించి, తమ జీవితముల చివరభాగమునందు, మితి మీరిన తమ భోగానుభవమువలని స్వాభావిక ఫలితముగ ప్రపంచ విషయములతో వెగటుచెందినదియు ఈ భారతదేశ మున నే. అటుల ప్రాపంచిక సౌఖ్యములందు తనివితీరి, వృద్ధాప్య మున వారువనములలో ఏకాంతస్థలములందు వసింపుచు, కడు దుర్గ్రాహ్యములగు జీవితసమస్యలంగూర్చి విచారింపఁదొడగిరి. తదనుగుణమగు వైరాగ్యము వారితత్వాన్వేషణముల మూల మున, పెచ్చుపెఱిగి భారమైతోచుచున్న కర్మాడంబరమున ఏవ జనించి, ఉపనిషత్తులందును, గీతయందును, జైనబౌద్ధశాస్త్ర ములందును ప్రకటింపబడిన అనుపమేయంబగు ఆత్మతత్వవిచా రణ వెలువడెను. ఇచ్చటను యాజక క్షాత్రాధిక్యతలకు రెంటి కిని పోరుకలిగెను. అనేకములగు క్రతువులు కర్మలు రూపు మాయుటచే యాజకవృత్తి వినాశనముపొందనయ్యెను. కాబట్టి స్వాభావికముగ అన్నిదేశములందును అన్నికాలములందును యాజకులు నడుముకట్టుకొని పూర్వసంప్రదాయాచారములను కాపాడవలయునని చేతనైనన్నిపాట్లు పడుచువచ్చిరి. మఱియు ఆధ్యాత్మ జ్ఞానముచే వెలుంగుచును క్షాత్రాధికారమును చెల్లించు జనకునివంటి రాజులు వీరికి ఎదురైనిలుచుందురు. ఈ

యాజక క్షాత్రవర్ణముల వారి పోరులగూర్చి యిదివరకే విపులముగ వ్రాయఁబడెను గదా !

సమస్తవిద్యలను జ్ఞానమును తనయందె కేంద్రీకరణము కావించుకొన (సమావేశముచేసికొన) వలయునని యాజకుడు ప్రయత్నింపుచుండ, ఐహికాధికారములను అన్నిటినిఁ తనయందు కేంద్రీకరణము కావించుకొనవలయునని రాజును మెలకువతో యత్నింపుచుండును. రెండును సంఘమునకు శ్రేయోదాయకములనుటకు సందియములేదు. ఏదో ఒక కాలమునందు అవిరెండును సంఘక్షేమమునకు ఆవశ్యకమే. కాని ప్రథమదశయందు అట్టిది శ్రేయోదాయకమే. సంఘము ప్రథమదశంగడచి, సమర్థతచేఁచెన్నారుతరుణదశకు వచ్చినప్పుడును బాల్యమునదానికితొడిగినదుస్తులనేబలవంతముగఁ తొడిగి, బహుస్వల్పమగు స్వేచ్ఛనుమాత్రమే అంగీకరింపవలయునని యత్నించినయెడల, అది తనసహజబలముతో ఆబంధములను ఛేదించుకొని ఉద్గమించును; లేదా అట్లుల చేయనోడినయెడల తిరోగామియై, క్రమక్రమముగ తన ప్రథమదశయగు అనాగరిక స్థితిని పడిపోవును.

రాజులు ప్రజలకు పితలవంటివారు; ప్రజలు రాజులకు బిడ్డలవంటివారు, ప్రజలు ప్రతివిషయమునను రాజును ఆశ్రయించుచు, ఆయనయెడల పూర్ణమగు విధేయతను చూపవలయును; రాజును నిష్పక్షపాతముగ వారిని పాలింపుచు, వారిక్షేమము విచారింపుచు, తనబిడ్డలందు ఎట్టిప్రేమంజూపునో ప్రజలయెడలను అట్టిప్రేమను చూపుచుండవలయును. వ్యక్తి

కుటుంబములందు ఏధర్మములు చెల్లునో పూర్ణసంఘము సందును అవియే వర్తించును. ఏలయన పలు కుటుంబముల కూడికయేగదా సంఘమగును. *"కొమరునకు పదునాఱు వత్సరములు వచ్చునప్పుడు తండ్రి వానిని తనస్నేహితునిగను తన సమునిగను భావింపవలెను" అను ధర్మముకలదు. బాల్యావస్థనున్న సంఘము ఎన్నడును పదునారు వత్సరముల యీడు నందకుండునా? ఏదో ఒక కాలమందు ప్రతిసంఘమును యౌవన దశనందుననియు, అప్పుడు రాజాధికారమునకును ప్రజలకును మిక్కుటమగు పోరుసంభవించుననియు చరిత్రయే తెలుపుచున్నది. అందుజయాపజయములను అనుసరించి సంఘజీవితమును, దాని విజృంభణమును, నాగరికమును వెలయుచుండును. సంఘవిప్లవముం కల్పించు నిట్టిమార్పులు చాలసారులు భారతదేశమున కలుగుచునే వచ్చినవి. కాని యీదేశమునకు మతమే ప్రాణమును, మతమే భాషయు, మతమే సమస్తఉద్యమములకు ప్రధానచిహ్నమును అగుట చేత, అవి ఈ భారతదేశమున మతము పేరుననే జరుగుచు వచ్చినవి. చార్వాకులు, జైనులు, బౌద్ధులు, శంకరుడు, రామానుజుడు, కబీరు, నానకు, చైతన్యుడు, బ్రాహ్మసమాజము, ఆర్యసమాజము ఇంకనిట్టి శాఖాంతరములును పురోభాగమున కాన్పించు పొంగును, నురుగును గర్జనమును, కాగా

* మహాప్రసిద్ధిజెందిన చాణక్యుని ధర్మములనుండి యెత్తివ్రాయబడినది. అతడిట్లు వ్రాసియున్నాడు. "బిడ్డకు ఐదేళ్ళు వచ్చువఱకు తండ్రి వానిని గారాబమున జూచుగాక; తరువాత పదివత్సరములవఱకు హితవుగఅపుచు పదియారేండ్లు వచ్చినప్పుడు తనతోసముడగు స్నేహితునిగ భావించుగాక"

వీని వెనుక మతములనెడు పెద్దలల లేచుచుండును. ఆవెనుక సాంఘికలోపములు సవరణ అగుచుండును. సమస్త ఈప్సితములు అర్థహీనములగు కొన్నిఅక్షరములను ఉచ్చరించు మాత్రాననే సిద్ధించుచుండినచో,తనకోరికలను నెఱవేర్చుకొనుటకై ప్రబలప్రియత్నములంజేసి శ్రమలపొందువాఁడెవఁడు? ఈ జాడ్యము సంఘశరీరమంతటను వ్యాపించినచో, అట్టిసంఘము సోమరియై, ప్రియత్నముఅనిన ఇచ్ఛలేక, సత్వరము నాశము నందును. కాబట్టియే ప్రత్యక్షానుభవములకు మించి దేనిని సత్యమని విశ్వసించని చార్వాకుల ఆక్షేపణలు! పశుయాగములు యజ్ఞములు మున్నగు అనర్థకర కర్మబాహుళ్యముచేత కృంగిపోవుచున్న సమయమున, కేవలము నయమార్గ విధులు, తత్వధర్మములు మాత్రమే ఆధారములుగ చేసికొనిన జైనవిప్లవకులే లేకయున్న, హిందూసంఘమును ఏది కాపాడి యుండెడిది? మఱియు అధికారయుతులగు ఉత్తమవర్ణముల వారి క్రూరకర్మలనుండి లక్షోపలక్షలుగ బాధలనందుచున్న నిమ్నజాతులవారిని బౌద్ధవిప్లవమేలేకయున్న ఎవరు రక్షించియుందురు? కాలానుసరణిని బౌద్ధమతమును క్షీణదశ నందగా వారి అసామాన్య పారిశుద్ధ్యతయు, నయవర్తనమునుపోయినవి. సమతఅనుపేర సర్వజన శరణ్యంబగు ధర్మమును అనుసరింతుమనుచు తమ మతములోనికి చేర్చుకొనిన చాల అనాగరిక జాతులవారి వికటనాట్యములచేత హిందూసంఘము వడంకిపోవునంతగా నీచమును, నీతిబాహ్యమును, అమాంగల్యమునుఅగు ఆచారములు వచ్చిపడినప్పుడు శంకరుఁడును, తద

నంతరము రామానుజులును అవతరించి, సంఘమును ప్రాచీనకాలపు విభవమునకుఁదెచ్చి, పూర్వౌన్నత్యమును తిరిగి స్థాపింప శక్తికొలది పాటుపడిరి. మఱియు కబీరు, నానకు, చైతన్యుడు, మహమ్మదీయ యుగమునను, ప్రస్తుతకాలమున బ్రహ్మసమాజ ఆర్యసమాజ సంస్థలును బయలుదేఱియుండ నిచో, ఇప్పటికి హిందూదేశమున మహమ్మదీయుల, క్రైస్తవుల సంఖ్య హిందువుల సంఖ్యకు చాలగా మించియుండెడిది అనుటకు ఎంతమాత్రమును సందియములేదు.

వివిధ వస్తువుల కూడికచేనైన శరీరమును వృద్ధిచేయు నట్టియు, అనంతమగు సంకల్పములు అనెడు అలలచేత ఒప్పు మనస్సును వృద్ధిచేయునట్టియు ఆహారముకంటె ఉత్కృష్ట పదార్థము ఎద్దికలదు? మఱియును అట్టి శరీరమును పోషించు నట్టియు, మనస్సును బలపఱచునట్టియు, ఆహారము చక్కగ జీర్ణముకాక, శరీర నైజధర్మములు చక్కగ వర్తింపనిచో అదియే సర్వానర్థములకును మూలంబగును గదా!

వ్యష్టిమానవుని జీవనము సమష్టిసంఘజీవనమును అను సరించియుండును. వ్యష్టిమానవుని ఆనందము సమష్టిఆనంద మును బట్టియుండును. సమష్టికి సంబంధములేని వ్యష్టిజీవనము అనగా అర్థమేలేదు. ఇది శాశ్వతమగు ప్రకృతి ధర్మము; ఈ జగమునకు సుస్థిరమగు పునాది. సమష్టితో ఏకీభావము కుదిరి అనంతమగు సానుభూతితో, సమష్టికి ఆనందము కలిగి నప్పుడు ఆనందింపుచు, కష్టముకలిగినప్పుడు దుఃఖింపుచు, సమ ష్టికై పాటుబడుట వ్యష్టిమానవునికి విధి. అట్టిది వాని విధియగు

లేగాక, దానికి భిన్నముగ వర్తించినచో వానికి మరణమును తప్పదు. అటులగాక దానినిఅనుసరించియే వర్తించినచోవానికి శాశ్వతసుఖము లభించును. ఇది ప్రకృతిమాతశాసనము. ఆమె (ప్రకృతి) నిరంతరము జాగరూకతతో మెలంగుచుండును. నామెకండ్ల దుమ్ముకొట్టుట యెవనికి సాధ్యము ? ఏవాడును సంఘమును కనుమొఱగి చిరకాలము మోసగింపజాలడు ! సంఘముయొక్క ఉపరితలమున చెత్త చెదారములు కుప్పలు కుప్పలుగ పేరుకొనినను, వాని అడుగున సర్వశరణ్యంబగు ప్రేమమును, అందఱియెడల దాక్షిణ్యమును పూని స్వార్థ త్యాగముచేగల్గు ఆస్పందనముతో కొట్టుకొను, సంఘపు పావన హృదయమును సర్వదాగోచరింపుచునేయుండును. సంఘము, తన బాధలను ఓపికమెయి భరించుటలో భూదేవివంటిది. ఎప్పుడోఒకనాడు సంఘము మేల్కొనును. (ఆమేల్కొలుపు చాలాకాలమునకు రావచ్చును) కాని ఆతల్లి మెలుకువకాంచి శరీరమును విదలింపుతఱిని, వేలకొలదిగ శతాబ్దములనుండి ఓపికతోమానముదాల్చియుంటవలనఉన్నతజాతులనుఅనుకొను వారి నీచస్వార్థపరతచే పెరిగి, పేరుకొనిన చెత్తచెదారములను అహీనబలములతో దిశాంతములకు విసరివేయును సుడీ !

ఈ సత్యమును మఱచి, పెక్కుసారులు కష్టములఁబడి శిక్షితులమైననుదానినిఇంకనుఅశ్రద్ధచేయుచునేఉన్నాము! వెడ గులమై మూఢత్వమూని, మనయందున్న పశుత్వమునకు దాసులమై, ఈ ధర్మమునందు అవిశ్వాసమును చూపు చుందుము. మోసముచేయజూచి, సదామనమే మోసపోవుట

తెలిసికొనుచును, మోసమును మానకున్నారము. కడు పిచ్చి వారమై ప్రకృతిని శాసింపఁదలఁచు చున్నారము! దీర్ఘదృష్టి లేక, స్వార్థముం జూచుకొనుటే పురుషార్థమును జీవితగమ్యార్థమును అని భావింపుచున్నారము.

జ్ఞానము, తెలివి, ధనము, స్నేహము, బలము, సమర్థత యింకను ఏవేవిప్రోగుచేసి ప్రకృతి మనయందు పెట్టియుంచినను, అవన్నియు అవసరసమయము వచ్చినప్పుడు ఇతరులకు పంచియిచ్చుటకే సుఁడీ! ఈమాటమఱచి మనకు అప్పగింపబడినవానిపైని "నాదే" యను ముద్రనువేయుచున్నాము; అందుతో మన వినాశబీజమును నాటుకొనుచున్నాము!

తన ప్రజల అందఱి సామర్థ్యములకును ఆశయమగు రాజు, తత్సామర్థ్యరాశిని తాను వృద్ధిచేసి, సంఘమంతటి శ్రేయము కొఱకు దానిని వేయియంతలు బలతరముగ చేసి, ఎల్లెడల వ్యాపింపజేయుటకై తనఅండను అవి ఉంచబడెనని శీఘ్రముగ మఱచును! గర్వోద్ధతుఁడై ఈశత్వమును తనయందే ఆరోపించుకొనుచు, * వేణుభూపతివలె ఇతర జనులు తనముందు అతిదైన్యమున చరింపవలయు నీచమానవులని భావించును. మంచిదైనను చెడ్డదైనను తన

* వేణుభూపతి కథ భాగవతమునగలదు. వేణుభూపతి తాను బ్రహ్మవిష్ణు మహేశ్వరులకన్న గొప్పవాఁడనని భావించి సమస్తపూజలు దనకే అర్పింపవలయునని ప్రకటనఁ జేసెను. మహాఋషులుఒకసారి వానియొద్దకేగి, అట్టిఅహంభావమువలదని బోధింపఁజూడ, వారిని అతఁడు దూషించి తనను పూజింపుఁడని ఆజ్ఞాపించెను. అంతట వారిఆగ్రహాగ్నిచే అతడు బ్రుగ్గవలసినవాడయ్యెను.

యిష్టమునకు ఎదురాడుట ప్రజలకుపాపమే! ఇట్లు రక్షణకు మారుగ భక్షణమును పోషణకు మారుగ జీవరసశోషణమును కలుగుచుండెను. సంఘము దుర్బలమైనచో, రాజుపెట్టు బాధలనెల్ల మౌనముతో అనుభవించుచుందురు; అందుకు సహజఫలముగ రాజును ప్రజలునుకూడ కడుహీనదశకువచ్చి, బలతరమగు ఏవిదేశీయప్రభువునకో ఎఱఅగుదురు. ఎచ్చట సంఘము ఆరోగ్యముగను బలముగను ఉండునో, అచ్చట రాజునకును ప్రజలకును ఘోరమగు పోరుసంభవించి తత్ప్రతి ఫలముగ, రాజదండము కిరీటమును దూరముగ పారవేయఁబడి, సింహాసనమును తత్సంబంధమగు రాజ్యవైభవ చిహ్నములును చిత్రప్రదర్శనశాలలందు ప్రాచీనకాలపు వింతవస్తువులుగ అమర్చబడుట తథ్యము!

ఈ పోరుయొక్క ప్రతిఫలముగ మహచ్ఛక్తివంతమగు వైశ్యుల ఆధిక్యత †ఉద్భవించుట కాననగును. వారి కోపో ద్దీపిత వీక్షణములకు కిరీటధారులును, మహావీరాగ్రేసరు లును, శిరీషకుసుమదళములలీల వడంకుదురు. మాయా మృగములీల దగ్గఱిన కొలందిని చేఁజిక్కక దూరస్థమగు చుండు, వైశ్యుని చేతిసంచిని ఆశించి, శ్రీమంతులును దరిద్రు లునుకూడ వ్యర్థముగ అతిదీనతమై వానివెంట పడుచుందురు.

"విద్యాశక్తియే శక్తి; విద్య నన్ను అనుసరించియుండును; నాస్వాధీనమందుఉండును; కాబట్టి సంఘము నా ఆజ్ఞాను

† శౌర్యమునకుమారుగా సంపదలు ప్రాధాన్యతవహించును.

వర్తియై చరింపవలెను" అని బ్రాహ్మణుఁడు తలంపుచుండును. కొంతకాలము అట్లే జరిగినది. "ఓ బ్రాహ్మణుఁడా! నీకడ విద్యా సామర్థ్యములు వెలయుచున్నను, నాకరవాలబలము లేకున్నచో నీవు ఎచ్చటనిలువగలవు? క్షణకాలములో నిన్ను పృథ్వినుండి తుడిచిపెట్టరా? కాన నేనే ఉత్తమతముఁడను" అని క్షత్రియుఁడు లేచెను. రక్తసిక్తమై భీకరమగు ఖడ్గము ఛట్ ఛట వెలువడె. సంఘము దానిమ్రోల సాష్టాంగప్రణామంబు లొనర్పనయ్యె! విద్యాదేవి పూజాధురంధరుఁడు సహా రాజునే పూజించుటలో ప్రథముఁడయ్యెను! అప్పుడు "ఓ వెడగులారా! సర్వోపగతయు ప్రతిభాసమన్వితయు అగు ఆదిదేవి, సర్వశక్తిస్వరూపిణియగు ప్రభ్వి, దగద్ధగ మెఱయుచున్న సువర్ణము (లక్ష్మి) నాచేతనున్నది. ఇటుచూడుడు! ఈమె ప్రసాదకలిమిని చేసి నేనును సర్వశక్తివంతుఁడనే! ఓ బ్రాహ్మణా! ఇప్పుడైనను ఈమె అనుగ్రహముచేత నీ జ్ఞానమును, నీ విద్యను, నీ స్తోత్రములను, నీ తపమును నేను కొనఁగలను. మఱియు ఓరాజా! నా యీప్సితార్థసంగ్రహణమునకై నీ ఖడ్గము, నీ ఆయుధములు, నీ పరాక్రమము, నీ సమర్థత అన్నియు, నా ధనలక్ష్మికటాక్షమువలన నేను శీఘ్రముగ ఉపయోగించుకొందును. ఇయ్యుత్తుంగవిశాల యంత్రశాలలను చూచితివే? ఇవియే నా తేనెతుట్టెలు. కోట్లకొలందిగమూగు మధుపములబోలు శూద్రులు సతతము తేనెలను తెచ్చి యీతుట్టెలందు నింపుట కనుగొంటివే? ఎవరికొఱకో యెఱుంగుదువా? నా కొఱకే! నా ప్రయోజనము, నా లాభము కొఱకై దానియందలి ప్రతి

చుక్కను వెనుకనుండి నేను సకాలమున ఒడుచుచుందును; వీక్షించితివా?" అని వైశ్యుడు పలుకుచుండును!

బ్రాహ్మణ క్షత్రియాధిక్యతలందు విద్యాసంచయమును, నాగరికాభివృద్ధియు కలిగినట్లే, వైశ్యాధిక్యతయందు ధనసంచయము గలుగును. వేని కణ కణ ధ్వని చాతుర్వర్ణముల వారి హృదయములను ఆకర్షించివేయునో, అట్టి రూప్యములు వైశ్యుని హస్తగతమైయున్నవి. ఈ తనసొత్తును యుక్తిచేత బ్రాహ్మణుఁడు అపహరించునేమో అనియు, ఆయుధబలముచేత బెదరించి క్షత్రియుడు లాగికొనునేమో అనియు వైశ్యుడు సదా భీతిలుచుండును. కాన ఆత్మరక్షణార్థమై వైశ్యులు అందఱును ఒక్కటై ఒకమాటమీఁద వర్తింతురు. వైశ్యునకు ధనము లోఁబడియుండును; దానిని ఇతరులు వాడుకొనుచో అందుకై ఆతఁడు తన్నిపుచ్చుకొను అమితమగు వడ్డీయే, సర్వజనుల గుండెలను భీతిలజేయు వాని దివ్యాయుధము! ఈ ధనశక్తివలన అతడు సదా రాజాధికారమును అరికట్టఁగలడు! తన ధనప్రవాహాస్వీకారమున రాజు అడ్డపడకుండ ఎల్లెడల జాగరూకుఁడై మెలగుచుండును. కాని, అటులైనను, అధికారబలము క్షాత్రవర్ణమునుండి శూద్రవర్ణమునకు పోవుట అనిన అతడిష్టపడడు సుమీ!

వర్తకుడు ఏదేశమునకు పోలేడు? తాను విద్యాహీనుడయ్యును, వర్తకవ్యాపారముచేయుటవలన, విద్యను, జ్ఞానమును, కళలను, శాస్త్రములను ఒకదేశమునుండి మఱియొకదేశమునకు కొనిపోఁగలఁడు! బ్రాహ్మణ క్షాత్రాధిపత్యములు

వెలసినప్పుడు సంచితమై, సంఘహృదయము నందు నిలిచియున్న విద్యానాగరికములు, వాణిజ్యము అను రక్తనాళములగుండా అన్నివైపులకు వ్యాపించి, వర్తక కూటములకుఁ బోవును. ఈ వైశ్యాధిక్యతలేనియెడల, నాగరికము, విద్య, ఘనతర రచనలు, ఆహారపదార్థములు, భోగపదార్థములును, జగమున ఒకభాగమునుండి మఱొక భాగమునకు, ఎవడు ఈ దినములలో సంయితము తీసికొనిపోయి ఉండఁగలడు?

బ్రాహ్మణుని ఆధిక్యతయు, క్షత్రియుని అధికారమును, వైశ్యునిబలమును ఎవరి శరీరకష్టముచే కల్గుచుండునో వారు ఎక్కడ? ప్రతిదేశమునను, సత్యముచేత, అట్టి వారివలననే సంఘము ఏర్పడుచున్నను, 'నికృష్టజన్మల'ని "నిమ్నజాతుల"ని సదాపిలువబడుచుండు ప్రజలచరిత్రమేమి? ఉత్కృష్ట వర్ణముల వారిచే ఇతరులకు పాలులేకుండ సంగ్రహింపఁబడిన విద్యను సంపాదింప యత్నించుచో, ఆ మహాదోషమునకై, "నాలుకం గోయుట, మాంసమును చెక్కుట" మొదలగు లలిత శిక్షలను భారతి ఎవరికి విధించియున్నదో, హిందూదేశంబున "నడయాడు శవంబులును" ఇతర దేశములందున "బరువులు మోయుపశువులును"నై ఎవరు పఱగుదురో అట్టి చతుర్థుల గతియేమి? కటా! నేటి భారతదేశముంగూర్చి యేమిచెప్పను? శూద్రులమాట అటుండనిమ్ము; ధర్మశాస్త్రవేత్తలగు బ్రాహ్మణులు ఎవరు? అనిన విదేశపుపండితులేగదా! క్షత్రియులో? ఏలికలగు ఆంగ్లేయులుగదా! వైశ్యులలో? వాణిజ్యచతురిమ రక్తమాంసములందు ఇంకియున్న హూణులేగదా! కాబట్టి బరువుల

మోయు పశుధర్మమగు శూద్రత్వము మాత్రము భారతీయుల పాలిట మిగిలినది. కటికిచీకట్లుక్రమ్ము నల్లనిమేఘము ఇప్పుడు మనలను అందఱను ఒక్కరీతినే కప్పియున్నది. కార్యచతురత గాని, నూతనోద్యమసాహసముగాని, కానరాదు. చిత్తస్థైర్యమును మనోదార్ఢ్యమును సున్న! పరజనతిరస్కారమునందు అసహనమా? దాస్యమునందు అసహ్యమా? పొడసూపవు! హృదయమునందు ప్రేమముగాని, ఆశగాని, పౌరుషముగాని కానరావు. చిక్కగ వేళ్ళుప్రాకి నాటుకొనియున్న మత్సరమును, పరస్పర వైరమును, పడరానిపాట్లుపడి దుర్బలుర బాధించు కుతూహలమును, కుక్కలరీతి నీచతకు ఓర్చి అధికారుల సేవచేయుటయు మాత్రము మన భరత దేశమున స్థిరపడినవి. ధనాధికారత్వదాడంబరము ఇంద్రియభోగలాలస యెడ శ్రద్ధయు, క్షణభంగుర విషయసంచమునందు బుద్ధికుశలతయు, కడు నీచవిషయంబులకై యోగశాస్త్రప్రయోగము, పరులయెడల బానిసలై మెలగుటలో అప్రమత్తతయు, అన్యదేశ నీచాచారములను అనుకరించుటయందు నాగరికభ్రాంతియు, దూషణభాషణములందు వక్తృత్వము, ధనాఢ్యుల ముఖస్తుతులు చేయుటయందు సాహిత్యగరిమయు, అసహ్యవిషయముల అభివర్ణించు పాండిత్యము మనపాలటపడి సంతుష్టినొసగు మహాపరమార్థములుగ పరిణమించినవి. దేశమందలి ప్రజలందరును ఇట్లు శూద్రులతో సమాన స్థితికివచ్చియుండగా శూద్రవర్ణముంగూర్చి ప్రత్యేకముగ వచింపనేల? భారతదేశమున తప్ప ఇతరదేశములందలి శూద్రులు ఒకింత మేల్కాంచి

నట్లు అగపడుచున్నది. కాని శూద్రస్వభావమగు విద్యా హీనత, స్వసంఘద్వేషము, పరస్పరవైరము వారిని విడువ లేదు. వారు ఇతరవర్ణములవారికంటె సంఖ్యయందు, మించియే యున్నారు. ఫలమేమి? పదిమందికి కోటిమంది బలమునిచ్చు ఐకమత్యము శూద్రులందు కానరాదు. కాబట్టి శూద్రజాతి వారు అన్యులకు లోబడియుండుట ఎల్లెడల నైజమైపోయినది.

అయినను నిరాశజెంద నవసరములేదు! దుర్నివార్య మగు కాలమహిమచేత బ్రాహ్మణులు మున్నగు అగ్ర వర్ణ ములవారు శూద్రత్వమున పడుచుండగనే, శూద్రులు ఉన్నత దశకు వచ్చుటయు కలదు! మున్ను రోమనులచే దాస్యమున కూల్చబడిన శూద్ర భూమియగు యూరోపుఖండము ఇప్పుడు క్షత్రియపరాక్రమముతో నిండియుండె! మనము చూచు చుండగనే, మహాబలసమన్వితయగు చీనాదేశము వేవేగ ముగ శూద్రత్వమున కూలుచుండగా అల్పదశనున్న జపాను దేశము ఆకాశాగ్నిబాణము (అవాయి) వలె శూద్రనైజమును దులిచివైచి పైకి ఎగసి అగ్రవర్ణములవారి స్వామ్యములపై ని దండు విడియుచుండె! నూతనముగ 'ఇటలీ,' 'గ్రీసు' దేశ ములు, క్షాత్రమును సాధించుటయు, టర్కీ, స్పెయిను మున్నగు దేశములు హైన్యమున బడుటయు మనము గమ నింపవలసిన విషయములే! కాని శూద్రులు తమ శూద్ర త్వము వీడకనే ఉచ్చదశకువచ్చు కాలము ఆసన్నమైయున్నది! అనగా ఇప్పటివలె శూద్రులు, వైశ్య క్షత్రియుల యొక్క ఉత్తమగుణములను, సంపాదించకయే, వైశ్యక్షత్రియ నైజ

గుణంబులకు భిన్నమగు తమ శూద్రస్వభావమును అభ్యాసములను మార్చుకొనకయే, ప్రతిదేశమునందును శూద్రులు సంఘమును వశము చేసికొని నిరంకుశాధిపత్యమును పూను కాలమువచ్చును! ఈఘనతర శక్తియొక్క ఉదయరాగము పాశ్చాత్యప్రపంచమున అల్లనల్లన చూపట్టుచున్నది! బుద్ధిమంతులెల్లరు ఇది ఎట్లు తుదకు పరిణమించునో అని వెఱగు చెందుచుండిరి. సాంఘికవాదము 1 (Socialism), అరాజకము 2 (Anarchism), నాస్తికవాదము 3 (Nihilism) మున్నగునవి రాబోవు సాంఘికవిప్లవమునకు పురోగాములయ్యె. గణితమునకు చిక్కక చిరకాలమునుండి ఇతరులు తమ్ము దౌష్ట్యమున బాధింప, దానిప్రతిఫలముగ శూద్రులు శునకములమాడ్కి అగ్రవర్ణములవారి పాదముల పూజించుచునో లేక పశువులలీల అమానుషస్థితిలోనో పడియుండిరి. మఱియు ఎల్లెడల వారి ఆశలు వృథాయగుచుండె; వారి ప్రయత్నములు నిష్ఫలములగుచుండె; కాన వారియుద్యమమున స్థిరత్వముగాని, ఆచరణయందు నిలకడగాని ఉండుటలేదు.

---

1 సాంఘికవాదము—ఈ పద్ధతిని అనుసరించువారు సంఘమున ఏది ఉన్నను దానిపైని అందరికి సమానాధికారము గలదనియు, ఎవరికిని ప్రత్యేకమగు సొత్తు ఉండవలదనియు వాదింతురు.

2 అరాజకము— ప్రభుత్వమును జెల్లించు రాజొకడు ఉండవలదు అనెడు వాదము.

3 నాస్తికవాదము—ఈ జగమునదేదియు స్థిరముగ ఉండునదిలేదు. ఏవిషయమునను ప్రత్యేకము కట్టుదిట్టములను ఏర్పఱచుట వృథా అనువాదము.

పాశ్చాత్యదేశములందు విద్యావ్యాపకము బాగుగ నున్నను, శూద్రవర్ణమువారు ఉచ్చదశకు వచ్చుటలో అనేకములగు ఆతంకములుకలవు; అనఁగా కొంచెము ఎచ్చుతగ్గుగా, మంచివో చెడ్డవో ఏకరీతిస్థితిగతులనుబట్టియే వర్ణనిర్ణయము కలుగుచున్నది. చిరకాలమునుండి భారతదేశమున ఆచారముగ వచ్చుచున్న యిట్టినిర్బంధవర్ణ నిర్ణయమువలన, శూద్రవర్ణము కాలు సేతులు కట్టివేయఁబడి, క్రిందఁపడియుండెను. శూద్రునకు మొదట ధనమును ఆర్జించుకొనుటనుగాని, యుక్తమగు విద్యాజ్ఞానముల సంపాదించుకొనుటకుఁ గాని అవకాశమే లేదయ్యె. శూద్రజాతియందు ఎవ్వఁడేని ఒకడు మహాధీశాలి ఉద్భవించెనేని, అధికారయుతులగు అగ్రవర్ణములవారు, వానికి ఏవో బిరుదాంకగౌరవములను ఒసంగి తమ సంఘములోనికిఁ తీసికొనెడివారు. వాని ధనమును వానిధీగరిమయు అన్యవర్ణములవారి కొఱకు ఉపయోగింపఁబడగా, వాని స్వవర్ణజనులు వానిసామర్థ్యఫలంబులను పాలుగొనజాలరైరి. ఇంతియేగాక అగ్రవర్ణము వారి యందలి అప్రయోజకులును, అధములును, త్యాజ్యులును శూద్రులలోనికి త్రోసివేయబడి వీరిసంఖ్యను వృద్ధిచేయుచువచ్చిరి.

అనుమానాస్పదమగు పుట్టువుగల వశిష్ఠుఁడు, నారదుఁడు, సత్యకామజాబాలి, వ్యాసుఁడు, కృపుఁడు, ద్రోణుడు, కర్ణుఁడు మున్నగువారు వారి వారి విద్యాపరాక్రమములఁబట్టి బ్రాహ్మణ క్షత్రియ వర్ణములలోనికిఁ లాగికొనఁబడిరి. కాని ఈ ఉద్గతిప్రాప్తివలన వారి పితలగు వెలయాలు, దాసి, శబరి,

సూతాదులు ఏమైన లాభమును పొందిరేమో విచారింపుఁడు! ఇందుకుమారుగ బ్రాహ్మణ క్షత్రియ వైశ్య జాతులలోనుండి పతితులగువారందఱును శూద్ర జాతిని పెంపుచేయుచువచ్చిరి.

ప్రస్తుతము భారతదేశమున, శూద్రుఁడై పుట్టిన వాఁడు కోటీశ్వరుఁడైననుసరే, గొప్పపండితుఁడైననుసరే, తనజాతినివిడుచుటకు అవకాశములేదు; అతఁడు తనజాతిలోనె ఉండి వానిధనము బుద్ధి జ్ఞానము వలనగలుగు సామర్థ్యమును స్వసంఘాభివృద్ధికై ఉపయోగింపశక్తుఁడగుచున్నాఁడు. పుట్టువుచే నిర్ణయింపఁబడు వర్ణవిధానము, దాని బంధముల త్రెంచకయే, క్రమక్రమముగ ఆయాసంఘముల అభివృద్ధికై తోడ్పడుచున్నది. వర్ణాధిక్యతను, స్థితిగతులను, పాటింపక, ప్రజలను పాలించు ప్రభుత్వముక్రింద ఉన్నంతవఱకు భారత దేశమందలి కనిష్ఠవర్ణములవారి ఉద్గమనము సాఁగుచునే ఉండును.

సంఘనాయకత్వము, విద్యచే సర్వాధికారము గల వారిచేతిలోనుండనీ, లేదాధనముచేతనో ఆయుధములచేతనో బలవంతులగువారిచేతిలోనుండనీ, ఆఅధికారమునకుఅంతకును మూలాధారముసదాసామాన్యజనులే శూద్రులేఅనుటనిజము. అట్టి అధికారకలితులు ఆ అధికారనిర్మాతలనుండి దూరస్థులై నిలిచినకొలఁదిని, బలహీనులగుచుంట సత్యము. ప్రత్యక్షముగనో పరోక్షముగనో, మోసము, యుక్తి, పీడనము అను మార్గములను అనుసరించుటచేతగాని, లేక స్వబుద్ధిచే ఇయ్యబడుటచేతగాని, ఆ అధికారము ఎవరివద్దనుండి కలుగుచుండెనో

అట్టివారిని అధికారులు నిరసించుచుంట విధివైపరీత్యమును మాయయొక్క వికృతచేష్టయు అనితోఁచెడిని! కాలానుసరణిని యాజకాధికారులు తమఅధికారమునకు కారణభూతులగు జనసామాన్యమునుండి దూరస్థులైనప్పుడు ప్రజాబలమును ఆధారముగఁగొనిన రాజులచే నిర్జితులైరి. మఱల ఈక్షత్రియ నాయకులును తాముసర్వస్వతంత్రులమనిభావించుకొనిప్రజల నుండి దూరగతులై భంగపడిరి. సామాన్యజనుల తోడ్పాటుచే జయశీలురగు వైశ్యులచేతిలో కేవలము ఆటబొమ్మలైరి. వైశ్యులుఇప్పుడు తమసంకల్పమును నెఱవేర్చుకొని కృతకృత్యులైరి. కాన వారును ప్రజలసాహాయ్యమును అంతగా గణింపక, వారినుండి దూరస్థులు కానెంచుచున్నారు. కాబట్టి ఈ వైశ్యులభంగపాటునకును అంకురము ఏర్పడుచున్నదిసుడీ.

ప్రజాసామాన్యము సర్వాధికారమునకు తాము ఆలవాలమయ్యును, తమలోఁ కలయికలేక, ఒండొరుల దూరముచేసికొనుటచేతఁ తమ నైజసత్వములను కోలుపోయిరి. తాము ఇట్టి స్థితిలో నిలిచియుండువఱకు వారు అటులనే యుందురు.

సామాన్యాపాయముగాని, లేక రాగద్వేషములకు సామాన్యకారణముగాని, మానవులను ఒక్కటిగ కూర్చుచుండును. ఘాతుకమృగముల బాధచే సాధుజంతువులను మందలు మందలుగకూర్చు సహజధర్మమే, మానవులను గుంపులుగచేర్చి ప్రత్యేకవర్గములు, సంఘములు అను వానిని సృష్టించుచుండును. స్వసంఘ స్వదేశములకొఱకగు ప్రేమాతిశయముగాని, పారశీకదేశమునెడల గ్రీకుదేశము, కార్తేజి

యెడల రోము, కాఫరులయెడల అరబ్బులు, మూరుల యెడల స్పెయిను, స్పెయిను యెడల ఫ్రాన్సు, ఫ్రాన్సుయెడల, ఇంగ్లాండుజర్మనీలు, ఇంగ్లాండుయెడల అమెరికాయు చూపునట్టి వైఖరినిపోలు బలవద్వేషముగాని, యితరులపైనివైరము సాధించుకొనుటకునై ఐకమత్యమును సంఘటిలచేసి, పరసంఘములకంటె ఉన్నతదశకు తెచ్చుటలో ముఖ్యకారణము కాగల్గుననుటకు సందియము లేదు.

ఆత్మానురాగమే స్వార్థత్యాగమునకు గురువు. ప్రత్యేకము తన లాభమునుజూచుకొనుటకై, మానవుడు ముందు సమష్టిలాభమునుచూచును. స్వసంఘముయొక్క క్షేమము నందే వ్యష్టిమానవుని క్షేమముండును; స్వసంఘసుస్థితియందే వ్యష్టిమానవుని సుస్థితియునుండును. అనేకుల తోడులేక చాలకార్యములు నిర్వహింపబడజాలవు. తుదకు ఆత్మరక్షణమును అసంభవమే. ఇట్లు ఆత్మశ్రేయముకొఱకు పరస్పర సాహాయ్యమున మిత్రులు ఐకమత్యముతో పనిచేయుచుంట అన్నిదేశములందును అన్ని సంఘములందును కానవచ్చును. పెంపొందుచుంటయు, యెప్పుడో భంగపఱచు దారిద్ర్యజీవనము చేయుటయు, ఇంతెకాక అగ్రవర్ణమువారి మతవృత్తులకు ఏవిధముననను లోపములేకుండ చూచుటయు హిందువులకు మహాలాభకరమగు అభిమానవిషయముగనున్నది! ప్రస్తుతము హిందూదేశమున ఇంతకంటె నెక్కువ ఆశ గాన రాదు; హిందువుల జీవితమున ఇదియే మహోన్నతదశ!

హిందూదేశమున ప్రస్తుతపు పరిపాలనమునందు కొన్ని చెడుగులుంట సత్యమే, కాని శ్రేష్ఠమగు విషయములును కొన్ని గలవు. అన్నిటిలో శ్రేష్ఠతమమైనదిఇది: పాటలిపుత్రరాజ్య ముఖిలమైనది ఆదిగ, ఇప్పటివఱకు దేశమంతు అంతటను అధికారము చెల్లింపుచున్న సమర్థమగు బ్రిటిషు రాజ్యతంత్రము వంటిది ఏదియు లేదు. సహజసాహసోపేతులగు ఈ వైశ్యుల అధికారముక్రింద వర్తకపు సామానులు ప్రపంచమందు ఒక ప్రక్కనుండి మఱియొక ప్రక్కకు తీసికొనిరాబడినట్లే, తత్ఫలముగ వివిధదేశములందలి భావములును సంకల్పములునుకూడ భారతభూమియందు అంతటను వ్యాపింపజొచ్చెను. ఈ భావములందును సంకల్పములందును కొన్ని శ్రేయోదాయకములై కొన్ని అనర్థదాయకములునైఉన్నవి. మఱికొన్ని ఈ దేశవాసులకు ఏది మేలుచేయునో విదేశీయులకు గ్రాహ్యము కాదనుటను ప్రకటింపుచున్నవి.

ఈ కీడుమేలులఁ పరిశీలించి చూచినయెడల భారతదేశపు భవిష్యదైశ్వర్యంపు ధ్వజము స్థిరముగ పైకిలేవనుండుట కాననగును! ఒక పక్షమున ప్రాచీన దేశీయాదర్శములకును, వేఱొండు పక్షమున నూతనముగవచ్చిన విదేశ జాతీయాదర్శములకును కలిగిన సమ్మేళనఫలముగా, నెమ్మది నెమ్మదిగ భారతమాత గాఢనిద్రనుండి మేల్కొంచుచుండెను. ఆమె లోపములనే చేయుగాక; కానిండు; హానిలేదు. మన చర్యలందుఅంతటనులోపములుకూడ మనకు గురువులే! ఎవడు లోపములకు వెఱవడో వానికే సత్యమార్గములలవడును.

చెట్లెన్నఁడునులోపములచేయవు; రాళ్లెన్నఁడును క్రమముం దప్పి వర్తింపవు; పశువులు ఎన్నఁడును తమ నైజ ధర్మముల పాసి చరింపవు. కాని నరుడు లోపములఁ చేయును; మఱియు అతఁడే పుడమిపైని వేలుపునుకాఁగల్గును! పుట్టినది ఆదిగఁ చచ్చువఱకు మన చైదములన్నియు, మనము నిద్ర లేచినది మొదలు పరుండువఱకు మన సంకల్పములన్నియు ప్రతిస్వల్పవిషయమునందును, మన కొఱకు ఇతరులచే నిర్ణయింపఁబడి, ఆ నియమ బంధములదాఁటి వర్తింపకుండ రాజు కరవాలము మనలను పట్టిఉంచినయెడల మనము ఇంక బుద్ధి పరిశ్రమచేయు అవసరమే కాన్పింపదుగదా! మనీషాగ్రేసరునిగ గాని ఋషిశ్రేష్ఠునిగగాని చేయునదిఏద్ది ? వాని యోజ, వాని తర్కజ్ఞానము, వానిబుద్ధియెగదా ? పరిశ్రమలేనిచో దీర్ఘాలోచన సామర్థ్యముపోయి, తమస్సువృద్ధియగును; బుద్ధిమందగించును; ఆత్మజడత్వముంకాంచును. అయినను, ప్రస్తుతకాలమునకూడ, ప్రతి మతగురువును, ప్రతిసంఘసంస్కర్తయు, సంఘముకొఱకు నూతన ధర్మములను, కట్టుదిట్టములను నిర్మింప చూచుచుండెగదా ! దేశమునకు ఎన్నఁడేని ధర్మశాసనములు లోపమగునా? కావలసినన్ని ఇదివఱకే లేవా? ఈ చట్టముల పీడచేతనే సంఘమంతయు వినాశమందుచుండెను ! దీనిని గ్రహించువాఁడెవఁడు ?

నిరంకుశ సర్వాధికారులగు రాజులు తాము జయించిన ప్రజలను నిరసించెడివారుకారు. అట్టి పాలనముక్రింద ప్రజలందఱి స్వత్వములును సమానమే; అనఁగా ఎవరికిని

ప్రత్యేకాధికారములుగాని, పరిపాలకుల కార్యముల పరిశీలించు స్వత్వముగాని ఉండెడివికాదు. కాఁబట్టి వర్ణాధిక్యత మున్నగు వానింబట్టి యెట్టి ప్రత్యేకపు అర్హతకును అవకాశమేలేదు. కాని యెక్కడ రాజ్యపాలనము ఏలిక జాతి వారలచే నిర్ణయింపఁబడునో, లేక నిర్దిష్టసంఘము ప్రజాప్రాతినిధ్యపద్ధతిచే పాలింపఁబడదో, అచ్చట నెల్ల యేలికలకును ప్రజలకును చాల దూరముండును. ప్రజాక్షేమముకొఱకే ఉపయోగింపఁబడిన యెడల, స్వల్పకాలములోనే వారికి అమితమగు మేలును ఒనకూర్పఁజాలు ప్రభుత్వాధికారమునందు గరిష్ఠభాగము, ప్రజలను పూర్ణముగ తమకు లోఁబడియుండు లాగున చేయ యత్నించుటలోనే వ్యయమగుచుండును. ఇక్కారణముచేతనే రోమను సామ్రాజ్యమందలి జనులు రోమక ప్రజాస్వామిక పాలనము (Roman Republic) క్రింద కంటె ఎక్కువ సౌఖ్యముగనుండిరి. ఈ కారణమువలననే క్రైస్తవ ప్రవాసిక బోధకుండగు పాలు (Paul) జయింపబడిన యూదియా జాతి వాఁడయ్యును తనయందు ఆరోపణచేయఁబడిన నేరముంగూర్చి రోమక చక్రవర్తియగు 'సీజరు'ను పునర్విచారణచేయుమని వేడుకొనఁగలిగెను. ఎవఁడేని ఒక ఆంగ్లేయుఁడు మనను "దేశీవాల" "బానిసపుర్వు" అని పిలచినను, మనలను అనాగరీకులగు మోటువారిగ భావించిద్వేషించినను మనకు లాభనష్టములు రెండును లేవు! కులభేదములవలన మనలో అంతకంటె నెక్కుడెట్లు బలతరములగు ఏవయు ద్వేషమును ఒండొరుల పైని చూపుకొనుచున్నారము. మందబుద్ధియగు క్షత్రియుఁడు

ఎవడేనితమమాట విననున్నచో, బ్రాహ్మణులు ఇప్పుడైననుతిరిగి శూద్రుల 'నాలుకలుకోయుంచుట, శరీరముల ముక్కలు ముక్కలుగ చెక్కించుట' అనెడు ప్రేముంపు కార్యములఁ చేయరని ఎవఁడనగలఁడు? ఇప్పుడిప్పుడు భరతఖండమున పూర్వభాగమందు, వివిధవర్ణములవారు సంఘస్థితిని బాగుచేసి కొనుటకై చేరి ఒండొరులపైని అనుతాపమును చూపుకొన యత్నించుటయు, మహారాష్ట్రమునందు బ్రాహ్మణులు మహారాష్ట్రజాతింగూర్చి జయమంగళకీర్తనలనుపాడ నారంభించుచుటయు నిష్కామక్రియలని శూద్రవర్ణమువారు విశ్వసింపజాలకున్నారు. హిందూదేశపు సామ్రాజ్యమునుకోలుపోవుచో ఆంగ్లేయజాతికి అపాయకారణమై, వారి వినాశమునకు హేతువు అగుననుతలంపు క్రమక్రమముగ ఆంగ్లేయజనుల మనసులందు నాటుకొనుచున్నది. కాన ఏ మార్గముననైనను ఆంగ్లేయపాలనము హిందూదేశమున స్థిరముగఁకాపాడవలసినదే! ఆంగ్లేయుల మహాగౌరవమును, వారిజాతీయవైభవమును హిందూదేశమున ప్రతివానిమనసున నాటుకొనునట్లుచేయుటే అట్టుల కావించుమార్గముఅని వారుతలంచుచున్నారు. ఈవికృతపుభావము హూణులందు ఎట్లు వ్యాపించుచుండెనో, ఈ భావమును ఆచరణయందు పెట్టుటకు క్రమముగ వారు వ్యూహములను ఎట్లుపన్నుచుండిరో, చూడ నవ్వును విచారము ఒక్కొక్కెడ కలుగుచుండును. ఈ హిందూదేశసామ్రాజ్యము వారికి లభింపఁజేసిన వారిధైర్యమును, పట్టుదలయు, కార్యసాధనమును, వారి జాతిఐకమత్యమును, సకలైశ్వర్యముల

కును ఆలవాలమగు హిందూదేశమును సంయితము, ఆంగ్లేయుల వర్తకకూటముగ మార్చిన, శాస్త్రబలోపేతమైన చాకచక్యముగల వారి వాణిజ్యచతురిమయు, వారి జాతీయస్వభావమునుండి అదృశ్యమగువఱకు, హిందూదేశమున వారిసింహాసనము స్థిరమే అనుట, హిందూదేశమున వసించు ఆంగ్లేయులు మఱచుచున్నట్లున్నది. ఆంగ్లేయులవర్తనమున ఈగుణములుండునంతదాక, హిందూదేశసామ్రాజ్య సహస్రంబులుపోవుగాక, తిరిగి అట్టివానిని వేనవేలుగ వారు సంపాదింపగలరు. కాని యిట్టిసద్గుణ ప్రవాహమునకు అడ్డుకలిగినచో, మిన్నకఆంగ్లేయగౌరవవైభవాతిశయంబులుఅనెడు మెఱుగులచే సామ్రాజ్యము నిలుచునా? కాబట్టి వారివర్తకమునగల మహద్గుణములు జాతీయలక్షణములుగ ఉన్నంతకాలమును'ప్రతిష్ఠ'ను కాపాడుకొనుటఅనెడు అర్థహీనమగు వ్యర్థప్రయత్నమున బలసామర్థ్యములను వ్యయముచేయుటఎంతయు వెడగుతనము. ఆసామర్థ్యమును తనుపాలనముననున్న ప్రజలక్షేమముకొఱకై ఉపయోగించునెడల ఏలికలకును ప్రజలకునుకూడ తథ్యముగ శ్రేయోదాయకమగునుగదా!

భారతదేశము అన్యసంఘముల సంపర్కముచేత, మెల్లమెల్లగ మేల్కొనుచుండెనని చెప్పియుంటిమి. ఈ మేలుకోలునుబట్టియే కొంతవఱకు ప్రస్తుతపు భారతదేశమున స్వేచ్ఛాస్వాతంత్ర్యభావములు అంకురించుచున్నవి. ఒకవంక, ప్రత్యక్షప్రయోగములవలన నేర్పఁబడిన అనవద్యమగు సత్యజ్ఞానము అను రథమును ఆరోహించి, కోటిసూర్యప్రకాశంబగు

తేజముతో కండ్లుమిఱుమిట్లుగొలుపు 'అధునిక పాశ్చాత్యభౌతిక శాస్త్రముం'డె; మఱొకవంక భారతభూమి మహోన్నతదశ నున్ననాటి మనపూర్వులంగూర్చిన ఘనతరములు ఉత్తేజజనక ములునగు కథలుండెను. ఈ కథలు మనచరిత్రమునందు స్వదేశపరదేశ పండితులవలన వ్రాయంబడి, సర్వజనశరణ్యాం బగు ప్రేమ చేనిండి, సమస్తనాళముల నుజ్జీవరసముతో పూరించి లెక్కలేని వత్సరములనుండియు, శతాబ్దముల నుండియు ప్రచారముననుండె. దేవతలను సయితము మత్సర ముతోడనింపిన అసదృశంబగు పరాక్రమమును, మానవా తీతమగు బుద్ధిబలమును దివ్యతరాత్మజ్ఞానమును ప్రకటించు ఈ కథలు భవిష్యత్తుం గూర్చిన ఆశను ప్రబోధమును ఒసంగుచున్నవి! ఒకవంక శుద్ధనిరీశ్వరవాదము, పూర్ణై శ్వర్యము, మహదధికారము, ఇంద్రియ లోలతయు, అన్యదేశ భాషాగ్రంథములద్వారా పెద్దకలవరమును కావించు చుండె; ఒకవంక ఈ వికారధ్వనుల గంద్రగోళమును కూడ దాటి నీరసముగనైనను, విస్పష్టమగుశబ్దములతో మన ప్రాచీన దైవతములు హృదయభేద్యములుగ మొఱలిడుట వినవచ్చు చుండె. మనయెదుట పాశ్చాత్యులచే నూతనముగ తెచ్చిపెట్టం బడిన వింతవింతలగు భోగములు కానవచ్చె,—స్వర్లోకపానీ యములు, అమూల్యమృష్టాన్నభోజనములు, రమ్యదుకూల ములు, మనోహరహర్మ్యములు, నూతన ప్రయాణరీతులు, నవీనజీవనపద్ధతులు, క్రొత్తయందములు, ఆధునికవిద్యాసంశోభిత లగు యువతుల, బిడియములేని స్వచ్ఛందవర్తనములు, విచిత్ర

వస్త్రధారణములు — ఇవన్నియు అపూర్వములగు అభిలాష లకు మూలకారణములగుచుండె! మఱియు ఈ రంగముమారి, ఆస్థానమున సీత, సావిత్రి, వీరిపవిత్రవ్రతచర్యలు, ఉపవాసములు, ఋషుల యేకాంతజీవనములు, దిగంబరులై తిరుగులాడు చుండు సన్యాసుల కావివస్త్రములు, సమాధులు, ఆత్మజ్ఞానా న్వేషణములు, సుస్థిరముగ గోచరింపుచుండె. ఒకవైపున స్వార్థ పరులగు పాశ్చాత్యసంఘముల స్వేచ్ఛావృత్తియుండె, వేఱొండు వైపున ఆర్యసంఘముల పూర్ణస్వార్థత్యాగముండె. ఇట్టి పర స్పర భిన్నవిషయంబులంబడి భారతజాతి ఇటునటు కొట్టుకొను చుంట అబ్బురమా? పాశ్చాత్యులకు పరమగమ్యార్థము-వ్యష్టి స్వాతంత్ర్యము, భాష-ధనాకర్షణమూలంబగువిద్య, మార్గము- రాష్ట్రపాలనాతంత్రము. హిందూదేశమునకో, పరమగమ్యా ర్థము—ముక్తి; భాష-వేదము; మార్గము-వైరాగ్యము. అభి నవభారతీయుఁడు “నన్నాకర్షించి వేసిన అనిశ్చయమగు ఆధ్యాత్మసౌఖ్యమునకై పేరాసపడి, వృథాగ ఎదురుచూచుచు, నాభౌతికజీవితమును చెడగొట్టుకొనుచుంటిని” అని ఒకప్పుడు విలపించును. వేఱొకప్పుడు ‘ఇతిసంసారేస్ఫుటతరదోషః కథ మిహమానవతపసంతోషః’ ఓనరుఁడా సదా మారిపోవుచు, మరణచిహ్నమగు సంసారమునఁబడితివి. నీకింక ఆనందము ఎక్కడ? అను ఇట్టి పలుకులను వెలుగుపడి ఆలకించుచుండును.

ఒకపక్షమున అభినవభారతీయుఁడు “వధూవరులనిర్ణ యించుకొనుటలో మాకుఁబూర్ణమగు స్వేచ్ఛయుండవలయును; మా భవిష్యజ్జీవనమున సుఖదుఃఖములకు అన్నింటికి వివాహామే

మూలము; కాన మా యిష్టప్రకారము చేయుటకుపూర్ణమగు స్వేచ్ఛయుండవలయును" అను చుండును. వేఱొకపక్షమునఁ బ్రాచీనభారతీయుఁడు వివాహము ఇంద్రియభోగములకొఱకు కాదు; జాతిరక్షణకై యేర్పడినది. "వివాహముఅన హిందువుల భావముమఱవకు. సంతానకారణముచేత నీవుసంఘముయొక్క మంచిచెడ్డలకు ఉత్తరవాదివి అగుదువు. కాబట్టిసంఘమే నీవు ఎవరిని పరిణయముకాదగునో, యెవరిని గాఁతగదో నిర్ణయించు అధికారముం కలిగియుండును. సంఘక్షేమమునకు ఏవిధమగు పరిణయములు అనుగుణ్యములో అట్టివే ఉండవలయును. సమష్టియొక్క మేలుకొఱకై నీవ్యష్టి సౌఖ్యాభిలాషలను అర్పణచేయవలయును"అని ధాటితోఁ బలుకుచుండును.

అభినవభారతీయుఁడు ఒకవైపు "మనము పాశ్చాత్యుల భావములను, పాశ్చాత్యులభాషను, పాశ్చాత్యుల ఆహారమును, పాశ్చాత్యుల ఆచారములను అవలంబించినచో, మనము పాశ్చాత్యసంఘములంత బలశాలురముగను సామర్థ్యయుతులముగను ఉందుము"అని వాదించును. మఱొకవైపునం ప్రాచీనభారతీయుడు " వెడఁగులారా ! అనుకరణమువలన, పరుల భావములు ఎన్నఁడును మీవి కానేరవు—స్వయముగ సంపాదింపనిచో ఏదియు నీయ దికాఁజాలదు. గార్ధభము మృగరాజువేషము వేసినంతమాత్రాన సింహము అగునా? " అని మందలించును.

ఒకతెగను అభినవభారతీయుడు " పాశ్చాత్యసంఘములుచేయునది స్పష్టమ్ముగ శ్రేయోదాయకమే. లేకున్న

వారంతగొప్పవారుఎట్లైరి?"అనుచు శంకించును. వేఱొకతెగను ప్రాచీనభారతీయ మెఱుపుయొక్కతళుకు బహుతీక్ష్ణముగ నుండును. కాని క్షణభంగురము. చూడుఁడు; బిడ్డలారా! అదిమీకండ్లను మిఱుమిట్లుగొలుపుచున్నది; భ్రాంతి! జాగ్రత్త! అని ఎచ్చరించును.

అట్లయిన, మనము పాశ్చాత్యులయొద్దనుండి నేర్చుకొనతగినది ఏదియులేదా ? ఉత్కృష్ట విషయములకొఱకై మనము యత్నింపవలదా? మనము పరిపూర్ణులమా ? మనసంఘము సర్వవిషయములందును లోపరహితమైనదేనా? కొఱతలేవియు లేవా? —నేర్చుకొనవలసిన ఘనతరవిషయములు అనేకము లున్నవి. నూతనమగు ఉత్కృష్టవిషయములను నేర్చుకొనుటకై ప్రాణములు పోవువఱకును పాటుపడుచుండవలసినదే—కృషియే (పాటుపడుటే) జీవగమ్యార్థము. శ్రీరామకృష్ణులవారు "నేను జీవించియుండునంతదాక (నూతన విషయముల) నేర్చుకొనుచనేయుండెదను" అనుచుండెడివారు. ఏ నరుఁడు, యే సంఘము నేర్చుకొనునది ఏదియు లేదు అనుకొనునో, అతఁడు, ఆసంఘమును మరణవాతపడినట్లే. పాశ్చాత్యులనుండి మనము అనేకవిషయములను నేర్చుకొనవలయునుఅనుటనిశ్చయమే—కాని అనర్థములును కలవు.

మితజ్ఞానియగు ఒక యువకుడు శ్రీరామకృష్ణులవారి ముందు హిందూశాస్త్రముల దూషింపుచుండెడివాఁడు. ఒకనాడు అతఁడుభగవద్గీతను మెచ్చుకొనగా శ్రీరామకృష్ణులవారు "ఐరో పాఖండపుపండితుఁడు ఎవ్వడో గీతనుపొగడినాఁడుఅని

తోఁచుచున్నది. కాబట్టి ఇతఁడును అట్లే చేయుచున్నాఁడు" అనిరి.

ఓ భరతదేశమా! నీకుగల అపాయకారణము ఇది. ఏది మంచిదో యేది చెడ్డదో, యుక్తి చేతను, అనుభవము చేతను, వివేకము చేతను, శాస్త్రాధారము చేతను, నిర్ణయము చేయుటకు మారుగాఁ పాశ్చాత్యులను అనుకరించుట అను సమ్మోహనము నిన్ను గట్టిగ పట్టుకొన్నది. ఏయే భావములను ఏయే ఆచారములను పాశ్చాత్యులుపొగడుదురో, ఇచ్ఛగింతురో అవియెల్లమంచివి; వారు వేనిని అసహ్యించెదరో వేనినిదూషించెదరో అవిచెడ్డవినా! కటకటా! ఇంతకన్న నీ అవివేకమును వెల్లడింపకావలయు మంచి బుజువెద్ది?

పాశ్చాత్యస్త్రీలు స్వేచ్ఛగా ఎల్లెడల తిరుగుచుందురు— కాన అదిమంచిది. వారు తమ భర్తలను తామే నిర్ణయించుకొందురు; కాన అదియే నాగరికాగ్రసోపానము. పాశ్చాత్యులు మన దుస్తులను, అలంకారములను, ఆహారమును, ఆచారములను నిరసింతురు —కాన ఇవిచాలచెడ్డవై యుండవలయును. పాశ్చాత్యులు విగ్రహారాధన పాపహేతువని ఖండింతురు; కాన నిశ్చయముగ విగ్రహారాధన మహాపాతకము, సందేహములేదు!

పాశ్చాత్యులు "ఏకేశ్వరారాధనము ఆధ్యాత్మ విషయంబులందు మహాశ్రేయోదాయకము" అందురు. కాబట్టి మనదేవతలనెల్ల గంగలోఁపడవేయుఁడు! పాశ్చాత్యులు వర్ణభేదములు హేయకరమని భావింతురు. కాబట్టి సర్వవర్ణభేద

ములను ఒక్కటిగ తుడిచివేయుడు! పాశ్చాత్యులు బాల్య వివాహములు సర్వానర్థములకు మూలములని యెదరు; కాన అది చాల చెడ్డది. నిశ్చయముగా అది అట్టిదే!

ఈ ఆచారములు ఆమోదింపఁబడ తగినవా? లేక త్యజింపబడ తగినవా? అని వాదన సలుపుటే వలదు. పాశ్చాత్యులు ఆమోదింపకుంటయే మన ఆచార మర్యాదల దుష్టత్వమునకు ఋజువైనచో వాని నిరసించుటయందుఁ పట్టుపట్టుటయే మనవిధి!

ఈప్రస్తుతపు వ్యాసకర్తకు (వివేకానందస్వాములవారికి) పాశ్చాత్యసంఘముంగూర్చి కొంతవఱకు స్వానుభవముకలదు. అట్టి అనుభవమునుబట్టి కలిగిన అభిప్రాయము ఇది:- పాశ్చాత్య సంఘమునకును భారత సంఘమునకును ప్రధానవిషయంబులందే చాలవ్యత్యాసముకలదు; వారి గమ్యార్థములు వేఱు; ఏ హిందూసంఘమైనను పాశ్చాత్య సంఘమును అనుకరించి వర్తించినచో ఉచితమార్గమును తప్పినది అగును. ఎన్నఁడును పాశ్చాత్య సంఘములందు వసింపకయె, స్త్రీపురుషులు అచ్చట కలసియుంటఁగూర్చి యెట్టివిధినిషేధస్మృతిశాసనములు కలవో, అవి ఎట్లు పాశ్చాత్యస్త్రీల శీలమును కాపాడునో తెలియకయే మన సంఘమందు స్త్రీపురుషులు ఏ అభ్యంతరములేక యథేచ్ఛగ కలసిమెలసియుండుటను అంగీకరించువారితోడ నాకు ఎంతమాత్రమును అనుతాపములేదు.

దుర్బలతర సంఘములవారి బిడ్డలు, ఇంగ్లాండున జన్మించినయెడల, గ్రీకులము, పోర్చుగీసులము, స్పానియార్డులము,

అని చెప్పుకొనుటకుమారుగ, ఆంగ్లేయులము అని చెప్పుకొను చుంట పశ్చిమఖండమున కాంచితిని. అందఱును బలాఢ్యులతోచేర యత్నింపుచుందురు; ఆ తేజోవంతుల తేజము తమపైఁబడి ప్రతిఫలింపవలెనని, అనగా గొప్పవారినుండి తెచ్చుకొనిన ప్రతిభ సాహాయ్యమున ప్రకాశింపవలెనని, దుర్బలురు సదాకోరుచుందురు. భారతీయుడుకూడ ఐరోపావారి దుస్తులను అలంకారములను ధరించుటఁచూచుచో, వీరలు అజ్ఞానులును, దరిద్రులును, విద్యాహీనులును, పరపీడితులును ఐన భారతీయులతోడి తమకు బంధుత్వముఁకలదని ప్రకటించుకొనుటకు సిగ్గుపడుచుండిరేమో అని నామనస్సునకు తోచుచున్నది! పదునారుశతాబ్దములనుండి హిందూదేశరక్తముచే బ్రతికిన పారశీ నేడు "స్వదేశీయుడు" కాడయ్యె! కులములేనివారువచ్చి బ్రాహ్మణులము అని నటింపుచు బ్రాహ్మణత్వముచే ప్రతిభ గాంచుచు చూపుధాటికి ఆగజాలక, ధీరుడగు కులీనబ్రాహ్మణుని ప్రాపమ్యమూ ప్రాచీనౌన్నత్యము, శూన్యమైచనుచుండె! కట్టుగుడ్డకుగతిలేని కోట్లకొలది హిందూదేశవాసులను మందబుద్ధులును అజ్ఞానులును అగు అధమజాతి అనార్యులు అని పాశ్చాత్యులు మనకు నేర్పుచున్నారు!! కాబట్టి వారు మన బంధుకోటిలోని వారుకాజాలరట!!!

ఓ భారతభూమీ! ఈపరనిందతోడను, అతిదీనతమొంది ఇతరులను అనుకరించుటతోడను, ఈపరతంత్రతతోడను, ఈ నీచమగు బానిసతనముతోడను, ఈఅసహ్యంపు క్రూరతతోడను, నాగరికమహోన్నత శిఖరమును ఆరోహింపగల్గుదువా?

ఇట్టిసిగ్గుమాలినపిరికితనముతో, ధైర్యసాహసోపేతులు మాత్రము పొందుటకుఅర్హమగు స్వాతంత్ర్యమును సాధింతువా? ఓ భారత మాతా! నీదు స్త్రీత్వాదర్శము సీత, సావిత్రి, దమయంతియును అని మఱవకుము; నీవు ఆరాధించు దేవుఁడు విరాగులలోనెల్ల విరాగియై సర్వపరిత్యాగియై పఱగు శంకరుడు, ఉమానాథుఁడు అని మఱవకుము; నీ వైవాహికధర్మము, నీసంతతి, నీజీవితమును ఇంద్రియభోగములకొఱకుగాని, నీవ్యక్తి సౌఖ్యము కొఱకుగాని కావు అని మఱవకుము; జగన్మాతకు అర్పితమై నీవుజనించితివని మఱవకుము! నీసాంఘికస్థితి జగన్మాతృత్వప్రతిబింబమని మఱవకుము; నీనిమ్నజాతులవారును, అజ్ఞానులును, దరిద్రులును, విద్యాహీనులును, చెప్పులుకుట్టువాడును, పాకివాడును, నీరక్తము నీమాంసమునై నీతనూజులే అని మఱవకుము; ఓ శూరాగ్రణీ! (భారతీయుడా) ధైర్యము పూనుము. సాహసముతోడ నుండుము. నీవు భారతదేశ వాసివి అని గర్వమున నుండుము! మఱియు "నేను భారతీయుడను-ప్రతిభారతీయుడును, నాసోదరుఁడే" అని ప్రకటింపుము. "అజ్ఞానియగు భారతీయుడును, దరిద్రుడై తినుటకులేని భారతీయుడును బ్రాహ్మణుఁడగు భారతీయుడును, మాలయగు భారతీయుడును, నా భ్రాతలే" అనుము! నీవు కౌపీనధారివైనను, "భారతీయుడు నాఅనుజుఁడు; భారతీయుఁడే నా ప్రాణము, భారతదేశపు దేవతయే నాదైవతము! ఓహోహో! ఈ దివ్యభారతభూమి బాల్యమున నా ఉయ్యలతొట్టియు, యౌవనమున నా కేళీవనమును, వృద్ధాప్యమున నావారణాశియు

నా స్వర్గతలమును అని ఉచ్చైస్స్వనముతోఁ చాటుము. భ్రాతృ సత్తమా! "భారతభూమియే నాకు మహేంద్రలోకము, భారత దేశపుమేలు నామేలు" అని స్మరించుము; "ఓ గౌరీనాథ! ఓ జగజ్జనకా! నాకు పౌరుషమును అనుగ్రహింపుము. ఓశక్తిస్వరూపిణీ అంబికా! నా దుర్బలతను తొలగింపుము. ఓ త్రిపురారీ! నా పౌరుషహీనతను తొలగింపుము. "ఓపార్వతీపతీ! నన్ను పురుషునిగ ఒనర్పుము!" అని రేయింబవళ్ళు మరల మరల ప్రార్థింపుము.

ఓభారతపుత్రి! సోదరీ! పరాశక్తిస్వరూపిణి శాంకరి నీ ఆదర్శముగదా! అబలవని తలచి బేలవై తేజము దక్కి మన నేల? త్రిమూర్తులును తమతమ శక్తులను ఆధారము చేసి కొనియేకాదా లోకరక్షణము చేయగల్గుట! స్త్రీ అండలేనిది జగమున పురుషుడు మాత్రమే సాధించజాలు కర్జమెద్ది? నీ దైన్యతను ఆవలత్రోసి, భారతమాత సేవకై భారతజాతి ఉద్ధరణకై స్వధర్మపాలనము సాగించుము. నీ పాతివ్రత్య ధర్మమును, మాతృత్వ మహిమను, సహజ సాహసౌదార్య గుణములను లోకమునకు గుణపాఠమునేర్ప ప్రకటింపుము. నీస్వార్థత్యాగము అగణితము. నీ ఓర్పు అసమానము. నీవు ధన్యమతివి.

ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్నిబోధత!

లెండు! మేల్కాంచుడు! బుధులచెంత జ్ఞానము గఱచుడు.

ఓం తత్సత్ ఓం.

సీ॥ అల "అహంబ్రహ్మాస్మి" ♦ యను మహోన్నత సత్వ
ధంబగు నాత్మత ♦ త్వంబునీది
అనిమొనలో వెను ♦ కడుగెఱుంగని ధీర
భయదూర శూరత ♦ త్వంబునీది
రహిని పరోపకా ♦ రార్థ మిదం "శరీ
రమ్మ"ను ధార్మిక ♦ త్వమ్మునీది
"ఆత్మవత్సర్వ భూ ♦ తాని" యనంజను
పరమ సేవాపర ♦ త్వంబునిది
గీ॥ ఇన్నియును నేడు మఱపొంది ♦ కన్నుమూసి
పిఱికివై, బేలవై, మను ♦ తెఱగు లేక
నిదురబోవంగ జెల్లునే ♦ బెదరుమాని
లెమ్ము, భారతమాత ధై ♦ ర్యమ్ము గనుము.

గీతమాలిక.

భారతీయుడ నేను, ఈ ♦ భరతదేశ
మమరలోకమే యగు నాకు; ♦ అధిక దీను
డైన హరిజనుండును మఱి ♦ అగ్రజాతి
బ్రాహ్మణోత్తముడును నాకు ♦ భ్రాతృవరులె ;
భారతీయ ధర్మమె నాకు ♦ ప్రాణపదము;
భరతదేశ దైవమెనాకు ♦ పరమదైవ
మంచు, నసమానమగు నభి ♦ మానజలధి
మగ్నమందుము; స్వాతంత్ర్య ♦ మార్గమందు
సుస్థిరుండవై నిలువుము ♦ శూరవర్య!
మేలుకొనుము భారతపుత్ర ♦ మేలుకొమ్ము.

సీ॥ వినయవివేక స ♦ ద్విద్యావిభూషణ
యుత సతీహితమైన ♦ మతము నీది
యమునితో బోరాడి ♦ రమణుని బడసిన
సావిత్రి గల్గు వం ♦ శంబు నీది
అఖిల లోకంబుల ♦ కాహార మొనగూర్చు
అన్నపూర్ణాదేవి ♦ యంశ నీది
భర్తకై దాస్యదు ♦ ర్భర బాధలను గన్న
చంద్రమతీదేవి ♦ స్థలము నీది

గీ॥ పరమ వైరాగ్యమూర్తి ♦ శాంకరియె నీదు
దైవమిక కొఱంతేమి? నీ ♦ ధర్మమెఱిగి
జగతికెల్ల నీసత్వంబు ♦ జాటుమమ్మ
మేలుకొమ్ము భారతపుత్రి ♦ మేలుకొనుము
మంగళంబగు నీ కగు ♦ మంగళంబు!

---

భారతీ ప్రెస్, తెనాలి.

# 1. జ్ఞానప్రియ.

(శ్రీతత్వానందస్వామి ప్రణీతము)

రెండవకూర్పు

పుస్తకభాండాగారములకు పాఠ్యగ్రంథసంఘము
(Madras Text book Committee)
వారిచేత సిఫారసుచేయిబడిన గ్రంథము.

విద్యావంతురాలగు తల్లి తనబిడ్డకు సకల ధర్మములు, సాంఘికనీతులు, మతరహస్యములు, పుణ్యజీవన విధానములు తేటతెలుగున సులభముగ అర్థమగునటుల బోధించు రీతి సంభాషణ రూపమున వ్రాయబడినది. ఏమాత్రము చదువు వచ్చినవారైనను స్త్రీలు పురుషులు యువకులు బాలురు బాలికలు ఎల్లఱు చదివితీరవలసిన గ్రంథము. గృహములలో సామాన్యముగా జరుగు సంగతులే ఉదాహరణలుగ - బడినవి. చక్కని నీతికథలు గలవు. వెల ౧౨ అ

# 2. శ్రీరామకృష్ణ పరమహంస జీవిత

(శ్రీతత్వానందస్వామి ప్రణీతము)

శ్రీశ్రీశ్రీ మలయాళస్వాములవారికి అంకితము చేయబడిన పవిత్రగ్రంథము.

మానవ జీవన రహస్యములను సమస్త పారమార్థిక సాధనలను విశదముచేయును. సిద్ధపురుషులయు, అవతార పురుషులయు మహిమలను వివరముగ తెలుపును. వేదాంత సంప్రదాయములను అన్నింటిని అవలంబించి స్వానుభవముచేత తేల్చిన సర్వమత సమ్మతములగు ధర్మములు చక్కగ బోధింపబడినవి. ఖండఖండాంతరములకును పోయి వేదాంతమతమును సర్వమత సమ్మతముగ నిరూపించి దిగ్విజయముగాంచిన శ్రీవివేకానందస్వాములవారి సద్గురువగు పరమహంసులవారి జీవితమును తెలియకోరని వారుండుటఅరుదు.

# 3. అనుష్ఠాన వేదాంతము.

(శ్రీ వివేకానందస్వామి ప్రణీతము.)

వేదాంతము సన్యాసులకును భిక్షువులకును మాత్రమే ఉపయోగపడుననియు, గృహస్థులకు లౌకికవ్యాపార నిమగ్నులకు వినియోగపడదనియు చాలమంది పొఱబడుచున్నారు. అట్టి భ్రమను తొలగించి, వేదాంతము సకలజనులును సర్వకాలసర్వావస్థలందును అన్ని వృత్తులవారును తెలిసికొని ఆచరించదగిన సుబోధయని ఎన్నెన్నియో నిదర్శనములతో ఋజువు చేయు గ్రంథము. ఉపనిషత్తులలోని మంచిమంచి కథలు, వాని సారాంశములు నీతులు ఇందు తెలుపబడియున్నవి. భాష శైలిక, వెలసులభము. ౭ అణాలు మాత్రము.

# 4. ముక్తికాంతా విలాసము.

(తరిగొండ వేంకమాంబా ప్రణీతము.)

నాటకమువలె బహుహృద్యముగ, సులభశైలిలో పబడినది. కీర్తనలు ఏలలు పద్యములు దండకములు మధ్యమధ్య కడురమ్యముగ చేర్పబడియున్నవి. భక్తులపాలిటి కల్పవృక్షము. యోగరహస్యముల తెలియగోరువారికి చింతామణి, వైరాగ్యరసము పిదుకు కామధేనువు. ఈ గ్రంథ విశేషమును వర్ణించుటఅలవికాదు. చదివిననే అనుభవైక వేద్యమగును, నవరసభరితము. వెల ౮ అణాలుమాత్రమే

ఈ నాలుగు పుస్తకములు ఒక్కసారిగా కొనువారికి అన్నియు రు ౧-౧౩-౦ కే యివ్వబడును,

తెనాలిలో శ్రీఓంకారాశ్రమమునకు గాని, గుంటూరు, కొత్తపేటలో శ్రీరామకృష్ణ పూజామందిరమునకు గాని మేనేజరు పేర వ్రాసి తెప్పించుకొనవచ్చును.

# వివేకచంద్రికలు ★ వివేకచంద్రికలు

శ్రీమత్ స్వామి వివేకానంద, అభేదానంద, శ్రీరామతీర్థస్వామి, శ్రీఅరవిందయోగి, మహాత్మాగాంధి మొదలగువారు భారతవర్షోద్ధారకులు. భారతవిజ్ఞాన నిర్మాతలు. వారి భగవద్విశ్వాసము, ఆత్మశక్తి, కార్యదీక్ష మొదలగునవి అపారము. పైమహనీయుల యుత్తమగ్రంథములు 12, వివేకచంద్రికలను పేర ప్రచురించియున్నాము.

| పుస్తకములపేర్లు | గ్రంథకర్తలు. | ఖరీదు. |
|---|---|---|
| 1. భక్తలక్షణములు | శ్రీకుసుమహరనాథ ఠాకూరు | 0_2_0 |
| 2. ప్రబుద్ధభారతము | శ్రీమత్ వివేకానందస్వామి | 0_2_0 |
| 3. విశ్వమతదర్పణము | ,, ,, | 0_2_0 |
| 4. గృహస్థాశ్రమతత్త్వము | శ్రీరామతీర్థస్వామి | 0_2_0 |
| 5. దుఃఖనివారణోపాయము | ,, ,, | 0_2_0 |
| 6 కర్మతత్త్వము | శ్రీమత్ అభేదానందస్వామి | 0_2_0 |
| 7. శ్రీరామకృష్ణ-వివేకానందులు | యం.వి.యల్. నరసింహారావుగారు | 0_2_0 |
| 8. భగవద్వినోదములు | | 0_2_0 |
| 9. శ్రీసమర్థ రామదాసస్వామి | | 0_2_0 |
| 10. యోగసాధన | శ్రీఅరవిందయోగి | 0_2_0 |
| 11. భగవద్గీతామృతము | శ్రీశర్మగారు | 0_2_0 |
| 12. ఇంద్రియ నిగ్రహతత్త్వము | మహాత్మాగాంధి | 0_2_0 |

ఈపండ్రెండు పుస్తకములు 800 పేజీలుండును. ఒకేపర్యాయ మీ పండ్రెండు పుస్తకములున్ను కొనువారికివి, రు 1-2-0 కే, లభించును. పోష్టుఖర్చులు ప్రత్యేకము. పుస్తకములు దొరకుచోటు:— శ్రీరామకృష్ణ పూజామందిరము,

కొత్తపేట, గుంటూరు.

# భక్తిప్రబోధిని.

## (48 పేజీల మాసపత్రిక. సం॥ చందా 1 0 0)

భగవదవతారములగు (1) శ్రీకృష్ణచైతన్య ప్రభువు, (2) భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస (3) శ్రీవివేకానందస్వామి, (4) శ్రీకుసుమహరనాథ ఠాకూరు, మొదలగువారి దివ్యజీవితములను, యుపదేశములను భక్తిబోధిని మాసపత్రిక యందు వరుసగా 1932 సం॥ అక్టోబరు నెలనుండి ప్రచురించుచున్నాము. ఇందు నెలకు 48 పేజీలుండును. ప్రతినెల 10 తేదీకి వెలువడును. ఇది ఆంధ్రసోదర సోదరీమణుల కందరికిని అందుబాటులో నుండగలందులకై, దీనికి సం॥ చందా, పోస్టేజితో రు 1-0-0 మాత్రము నేర్పాటు చేసియున్నాము.

1. శ్రీకృష్ణనామ సుధారసముచే, ఆసేతుహిమాచల పర్యంతము, భారత దేశమును పదునుచేసిన, శ్రీకృష్ణచైతన్య మహాప్రభువువారి చరిత్రమును, యుపదేశములున్ను, భగవన్మహిమా విశేషములున్ను,
2. తనమురళీగానమాధుర్యముచే, శ్రీకృష్ణనామమును లోకమునందు వెదజల్లిన 20 శతాబ్దపు యుగపురుషుడగు, శ్రీకుసుమహరనాథ ఠాకూరువారి చరిత్రమును యుపదేశములు, భగవన్నామ మహిమాదులున్ను,
3. భక్తులలో నుత్తమభక్తుడును, యోగులలో మహాయోగియు, జ్ఞానులలో మహాజ్ఞానియును, శ్రీరామ, శ్రీకృష్ణుల యొక్క సమ్మేళనావతారము నైన భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంసవారి చరిత్రమును యుపదేశములున్ను,
4. తనవేదాంతగర్జనలచే, ఖండఖండాంతరములందు హైందవ భగవత్తత్త్వమును ప్రజ్వలింపజేసిన శ్రీమత్ వివేకానందస్వామివారి చరిత్రమును, యుపదేశములున్ను, ఆధ్యాత్మిక ధర్మాచరణక్రమమున్ను,

పఠించి అందలివిషయమును తెలిసికొనగోరు వారందరును భక్తిప్రబోధినిని తప్పక చదివి తీరవలెను. అది తమ కెంతయో యుపకారముచేయును.

దొరకుచోటు:—

## శ్రీరామకృష్ణపూజామందిరము.

### కొత్తపేట, గుంటూరు.